
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ
జిల్లా వార్తలు
గురువారం 27 మార్చి 2025 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6.24 గురువారం సాయంత్రం
సహరి: 4.41 శుక్రవారం ఉదయం

బాలబాలాజీ ఆదాయం
రూ.18,90,148
7

ఇరిగేషన్‌పై ఫోకస్

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ముగిసిన జిల్లా కలెక్టర్ల సదస్సు
- ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించండి
- ఎయిమ్స్ కళాశాల అద్దె చెల్లించండి
- తలసరి ఆదాయం తగ్గుతోంది.. దృష్టి పెట్టండి
- కలెక్టర్ మహేష్‌కుమార్‌కు చంద్రబాబు ఆదేశం
- పుష్కరాల కోసం ప్రత్యేక అధికారుల నియామకం
- ముగిసిన కలెక్టర్ల సదస్సు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెండు రోజులపాటు జరిగిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సదస్సు బుధవారం రాత్రితో ముగిసింది. జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చంద్రబాబు తన ప్రసంగంలో కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. రాగల రోజుల్లో ప్రభుత్వం చేపడుతున్న పథకాలను పకగ్బందీగా అమలుచేసి ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యతలను కలెక్టర్లకు ఇచ్చారు. దీనిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి హాజరైన కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల నివేదికతోపాటు అత్యవసరంగా చేపట్టాల్సిన వివిధ పనులకు నిధుల మంజూరు కోరుతూ ఇచ్చిన నివేదికను చంద్రబాబు ప్రత్యక్షంగా పరిశీలించారు. వాటిలో కొన్నిటికి పరిష్కారం చూపించారు. ముఖ్యంగా ఇరిగేషన్ ప్రాజెక్టుల అభివృద్ధిలో భాగంగా ఏటిగట్లు, అవుట్‌ఫాల్‌స్లూయిస్, కల్వర్టులు, లాకులు, వంతెనల నిర్మాణాలకు రూ.9.4 కోట్లు కేటాయించాలని కలెక్టర్ సూచనకు చంద్రబాబు స్పందించారు. వాటిని జలవనరులశాఖ ద్వారా ఆ పనులు చేపట్టేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అలాగే కొత్తగా ఆవిర్భవించిన కోనసీమ జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు ముమ్మిడివరంలోని ఎయిమ్స్ కళాశాల భవనానికి మూడేళ్లుగా చెల్లించాల్సిన లీజు బకాయిలైన రూ.5.11 కోట్లను చెల్లించడానికి ఆర్ అండ్‌బీ అధికారులకు సీఎం చంద్రబాబు క్లియరెన్స్ ఇచ్చారు. వెంటనే ప్రభుత్వ కాంప్లెక్సు సముదాయానికి చెల్లించాల్సిన అద్దె బకాయిలను చెల్లించాలని సూచించారు. ముఖ్యంగా కోనసీమ జిల్లాలో తలసరి ఆదాయం తగ్గుతున్న దృష్ట్యా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కోనసీమలో అరటి, కొబ్బరి, కోకో, వరికి వాల్యూ ఎడిషన్ తెచ్చేందుకు ప్రత్యేక దృష్టి సారించాలి.. ఆక్వా రంగంలో ఏపీ మొదటిస్థానంలో ఉన్నా ఆక్వా ఉత్పత్తులకు మరింత వాల్యూ తెచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. ఆక్వా రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే రూ.1.50కే యూనిట్ విద్యుత్ ఇస్తాం. వందశాతం సబ్సిడీతో మైక్రో న్యూట్రియంట్స్ సరఫరా చేస్తాం. రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ రాదనే విషయాన్ని గ్రహించాలని సీఎం ఈ సందర్భంగా సూచించారు. త్వరలో గోదావరి పుష్కరాలు వస్తున్నందున ఉమ్మడి గోదావరి జిల్లాలో పుష్కరాల కోసం ప్రత్యేక అధికారి, అసిస్టెంట్ అధికారులను నియమించి ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లను పూర్తి చేస్తామని ప్రస్తావించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడే రీతిలో పుష్కర ఏర్పాట్లు ఉంటాయన్నారు. అదేవిధంగా జిల్లాలో ఆక్వాకల్చర్ విస్తరణ, అభివృద్ధికి ఫిషరీస్ డిపార్టుమెంట్ చర్యలు చేపట్టాలని, జిల్లాలో ఉన్న ట్యాంకులను గుర్తించి వాటిలో నీళ్లు నింపి ఫిషరీస్ సొసైటీలకు అప్పగించాలని సీఎం సూచించారు. అయితే ఎక్కువగా బోగస్ సొసైటీలు ఉన్న దృష్ట్యా జాగ్రత్తలు తీసుకుని అటువంటి వాటిని ఏరివేయాలని అధికారులకు సూచించారు. రైతులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హోప్ ఐలండ్‌తో పాటు కోనసీమ జిల్లాలో పర్యాటకశాఖ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని, ఇంటర్నేషనల్ టూరిస్టులను ఆకర్షించే రీతిలో పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందాలని చంద్రబాబు ఆకాంక్షించారు. పర్యాటకులతోపాటు ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరింత మెరుగు పరచాల్సిందిగా సూచించారు. జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి కలెక్టర్‌కు పలు సూచనలు ముఖ్యమంత్రి చేశారు.





సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు.. సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్

జిల్లాకు 17వ ర్యాంకు..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పీజీఆర్ఎస్ స్కోరులో రాష్ట్ర వ్యాప్తంగా 17వ ర్యాంకు సాధించింది. జిల్లాలో ఈ స్కోరు కార్డులకు సంబంధించి గ్రీవెన్స్ రిసీవ్డ్ స్కోర్ 5.71, గ్రీవెన్స్ క్లోజర్ విత్ ఇన్ ఎస్ఎల్ఏ స్కోర్ 19.53, క్వాలిటీ రిడ్రెసెల్ స్కోర్ 15.25, వీఐపీ గ్రీవెన్స్ క్లోజర్‌విత్ ఆన్ఎస్ఎల్ఏ స్కోర్ 19.24, వీఐపీ క్వాలిటీ రిడ్రెసెల్ స్కోర్ 8.34 ఉండగా మొత్తంగా 68.07 స్కోర్ సాధించి రాష్ట్రంలో జిల్లా 17వ ర్యాంకులో నిలిచింది. క్యాప్చరింగ్ ఆఫ్ హౌస్ ఇమేజ్ జియో కోఆర్డినేట్స్‌కు సంబంధించి జిల్లాలో మొత్తం హౌస్ హోల్ట్స్ 6,08,363 ఉండగా జియో కోఆర్డినేట్స్ క్యాప్చరింగ్ 5,29,737 జరిగింది. దీనిలో భాగంగా మైగ్రేట్ హౌస్‌హోల్ట్స్ 1966 ఉండగా పెండింగ్‌లో 6920 ఉన్నాయి. మైగ్రేట్ అవుట్ సైడ్ ఆఫ్ ఏపీలో 19,957 ఉండగా 31,633 మంది మృతి చెందినట్టు గుర్తించారు. చిల్డ్రన్ విత్ ఆధార్ యాజ్ ఫర్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో జిల్లాలో ఆధార్ చేయించుకోని పిల్లలు 27,482 మంది ఉండగా ఈ ఏడాది మార్చి 22 నాటికి 20,350 మంది పిల్లలు ఎన్‌రోల్ చేసుకున్నారు. బర్త్ సర్టిఫికెట్ అందుబాటులో ఉన్న 10,391 మంది పిల్లలను గుర్తించారు. ఇంకా 23,081 మంది పిల్లలను ఎన్‌రోల్ చేయాల్సి ఉంది. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అధికారుల ప్రవర్తనపైనా ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు.

ఉద్రిక్తత..ఉత్కంఠ
- రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రివద్ద రోజంతా టెన్షన్
- పాస్టర్ ప్రవీణ్ మృతదేహం హైదరాబాద్ తరలింపు

7

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి
7

పాసింజర్ ఆటోను ఢీకొన్న వ్యాన్

పీఎం యోగా అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో యోగా అభివృద్ధికి అత్యుత్తమ కృషిచేసిన వారికి 2025 సంవత్సరానికి ప్రధానమంత్రి యోగా అవార్డును అందజేయస్తారని కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. యోగా అవార్డుకు ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. నిష్కలంకమైన ట్రాక్ రికార్డు కలిగి ఉన్నవారు సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు అందించవచ్చని, స్వయంగా కూడా తమ దరఖాస్తులను ఈనెల 31వతేదీలోగా సమర్పించాలని ఆయన కోరారు.

రబీ ధాన్యం సేకరణకు సర్వసన్నద్ధం కావాలి

- జేసీ నిషాంతి

అమలాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం సేకరణకు సర్వసన్నద్ధం కావాలని జేసీ టి.నిషాంతి సంబంధిత అధికారులు, మిల్లర్లను కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతోపాటు లైన్ డిపార్టుమెంట్ అధికారులతో రబీ ధాన్యం సేకరణ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతు ప్రయోజనాలే లక్ష్యంగా కార్యాచరణ ఉండాలని సూచించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తిస్థాయిలో విజయవంతమైందన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించి బ్యాంకు గ్యారెంటీలు, రెన్యువల్, బఫర్ గోదాముల వినియోగం, తేమ తూనికల పరికరాలు, గోనెసంచులు, రవాణా, టెక్నికల్ అసిస్టెంట్స్, వీఏఏ జీపీఎస్ కోఆర్డినేట్స్‌తో వాహన సరఫరా కోసం కస్టోడియన్ అధికారుల నియామకం, ఎఫ్‌టీవో జనరేషన్, కాగిత రహిత డిజిటల్ లావాదేవీలు తదితర అంశాలపై జేసీ సమీక్షించారు. జిల్లాలో ఈ-పంట నమోదు ఆధారంగా రబీలో 1,64,854 ఎకరాల్లో వరి పంట సాగు చేశారన్నారు. 6.17లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం ఉత్పత్తిఅయ్యే అవకాశం ఉందన్నారు. ధాన్యం సేకరణకు జిల్లాస్థాయిలో జేసీ చైర్మన్‌గా, ఆర్డీవోలు, పౌర సరఫరాల డీఎం, డీఎస్వో, డీఏవో తదితర అధికారులు సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేశామన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన 404 రైతు సేవా కేంద్రాల్లోని కొనుగోలు కేంద్రాల్లో అమ్మి మద్దతు పొందేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.రైసు మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ,చౌదరి మాట్లాడుతూ ముందుగానే బాయిల్డ్ రైస్, రారైస్ లక్ష్యాలను మిల్లర్లకు తెలపాలన్నారు.ట్రక్కు సీటు జనరేట్ కాగానే మిల్లర్ల లాగిన్‌కు సమాచారం ముందుగా వస్తుందని తదనుగుణంగా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. గోను సంచులను మిల్లర్లు సరఫరా చేస్తున్నప్పటికీ వాటి చార్జీలు రైతుల పేరున జమ అవుతున్నాయన్నారు.

ధరల స్థిరీకరణకు చర్యలు

ధరల స్థిరీకరణకు వివిధ శాఖల అధికారులతో డీఎస్వో ఎ.ఉదయభాస్కర్ సమీక్షించారు. నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు స్థిరీకరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కూరగాయలు, ఇతర పంటల ధరల పర్యవేక్షణకు వ్యవసాయ, మార్కెటింగ్,తూనికలు, కొలతలశాఖల సహకారంతో రైతులకు మద్దతుధర దక్కడంతోపాటు వినియోగదారులకు ధరలు అందుబాటులో ఉంచాలన్నారు. ధరల్లో హెచ్చుతగ్గులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎవరికీ ఇబ్బందిలేని రీతిలో సమతుల్యం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, డీసీవో మురళీకృష్ణ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ బాలసరస్వతి, మార్కెటింగ్ ఏడీ విశాలాక్షి, కార్మికశాఖ సహాయకమిషనర్ నాగలక్ష్మి, తూనికలు, కొలతల కంట్రోలర్ రాజేష్ పాల్గొన్నారు.

నేడే ఉప ఎన్నికలు



- జిల్లాలో ఒక ఎంపీపీ, మూడు వైస్ ఎంపీపీ, 18 ఉపసర్పంచ్‌ల పదవులకు ఎన్నిక

అమలాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఒక ఎంపీపీ, మూడు వైస్ ఎంపీపీ స్థానాలతో పాటు 18 పంచాయతీల ఉపసర్పంచ్‌లకు ఎన్నికలు గురువారం నిర్వహించడానికి ప్రత్యేక అధికారులను నియమించారు. దీనిలో భాగంగా కాట్రేనికోన ఎంపీపీ వైసీపీకి చెందిన ధనలక్ష్మి ఇటీవల మృతి చెందడంతో ఆ స్థానం భర్తీకి గురువారం ఎన్నికలు నిర్వహించనున్నారు. వైసీపీ అధీనంలో ఉన్న ఈ స్థానం కోసం ఆ పార్టీలోని సామాజికవర్గాలవారీగా పార్టీ ఎంపీటీసీలు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. కాగా పి.గన్నవరం వైస్ ఎంపీపీ, సఖినేటిపల్లి మండల పరిషత్‌లో రెండు వైస్ ఎంపీపీ పదవులకు ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 18 పంచాయతీల ఉపసర్పంచ్‌ల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆత్రేయపురం మండలం పులిదిండి, రాయవరం మండలం వెదురుపాక, రాయవరం, ఐ.పోలవరం మండలం జి.మూలపాలెం, ముమ్మిడివరం మండలం సీహెచ్.గున్నేపల్లి, రాజోలు మండలం శివకోటి, సోంపల్లి, ఆలమూరు మండలం మొదుకుర్రు, కొత్తపేట మండల పరిధిలోని కొత్తపేట, పలివెల పంచాయతీలు, మలికిపురం మండలంలోని లక్కవరం, చింతలమోరీ ఎన్నికలు జరగనున్నాయి. సఖినేటిపల్లి మండలం మోరికోడు, అంతర్వేది పాలెం, అంబాజీపేట మండలం మాచవరం, అల్లవరం మండలం యెంట్రుకోన, అయినవిల్లి మండలం పోతుకుర్రు, రామచంద్రపురం మండలం నీలపర్తిపాడు పంచాయతీల్లో ఉపసర్పంచ్ పదవులకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు తగిన రీతిలో అధికారులు ఏర్పాట్లు చేశారు.

కాట్రేనికోన ఎంపీపీ పదవి ఎవరిని వరించేనో?

- ఆసక్తికరంగా మారిన రాజకీయాలు
- రెండువర్గాలుగా వైసీపీ ఎంపీటీసీలు

కాట్రేనికోన, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన ఎంపీపీ పదవి ఎవరిని వరించేనో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సామాజిక సమీకరణల్లో భాగంగా వైసీపీలోనే ఎంపీటీసీలు రెండు వర్గాలు విడిపోయారు. ఇక్కడ వైసీపీ ఎంపీపీ పాలెపు లక్ష్మి మృతి చెందడంతో ఈ స్థానానికి ఎన్నిక జరగనుంది. బీసీ మహిళకు కేటాయించిన ఎంపీపీ పదవిలో ఇప్పటివరకు అగ్నికుల క్షత్రియవర్గానికి చెందిన పాలెపు లక్ష్మి ఉన్నారు. ఆమె మృతితో ఆ పదవికోసం శెట్టిబలిజ సామాజికవర్గం పట్టుబడుతోంది. 21 ఎంపీటీసీ స్థానాలకుగాను ప్రస్తుతం 19మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఇద్దరు మహిళలు మాత్రమే శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన వారున్నారు. అగ్నికులక్షత్రియవర్గానికి చెందిన మహిళా ఎంపీటీసీలు ఐదుగురున్నారు. ఈ నేపథ్యంలో పల్లం-2 ఎంపీటీసీ కోలాటి సత్యవతికి ఎంపీపీ పీఠం అప్పగించేందుకు మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్ కుమార్ ఆధ్వర్యంలో 14మంది ఎంపీటీసీలు యానాంలో రహస్య శిబిరంలో ఉన్నట్టు సమాచారం. ఇక ఇద్దరు శెట్టిబలిజ ఎంపీటీసీలు, ముగ్గురు టీడీపీ ఎంపీటీసీలు మిగిలారు.



కాట్రేనికోనలో విలేకరులతో మాట్లాడుతున్న శెట్టిబలిజలు

పొన్నాడ తీరుతో శెట్టిబలిజలు దూరం

ముమ్మిడివరం వైసీపీలో ముసలం పుట్టింది. నియోజకవర్గంలో భారీగా ఓట్లు కలిగిన శెట్టిబలిజ సామాజికవర్గీయులు ఇంతవరకు వైసీపీకి విధేయులుగా ఉండగా మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ తీరుతో వారంతా పార్టీకి దూరం కానున్నారు. దీనికి కాట్రేనికోన ఎంపీపీ ఎన్నిక వ్యవహారం కారణం అవుతోంది. ఎంపీపీ పాలెపు లక్ష్మి మృతితో గురువారం బీసీ మహిళకు కేటాయించిన ఈస్థానానికి ఎన్నిక జరగనుంది. ఎంపీపీకి 14 నెలలే పదవీకాలం ఉండగా ఎంపీపీ స్థానాన్ని తమ సామాజికవర్గానికి కేటాయించాలని పొన్నాడను శెట్టిబలిజ నాయకులు కోరారు. ఆయన మాత్రం తన సామాజిక వర్గానికి చెందిన మహిళకే పదవి ఇస్తానని కఠినంగా బదులిచ్చారు. దీంతో ఇంతవరకు పొన్నాడ వెంట నడిచిన శెట్టిబలిజలు ఆవేదన చెందుతున్నారు. కాగా బుధవారం వైసీపీ సీనియర్ నాయకుడు సంసాని నాగేశ్వరరావు ఇంటివద్ద శెట్టిబలిజ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు పొన్నాడకు పలు ప్రశ్నలు సంధించారు. 'గతంనుంచి పార్టీకి కట్టుబడి మీ వెంట నడిచాం. మీలా మాకు కులపిచ్చి ఉంటే మేము గుత్తుల సాయి, కుడుపూడి సూర్యనారాయణరావు లేదా పితాని బాలకృష్ణ వెంట వెళ్లి ఉండేవాళ్లం. మేము మీలా కులగజ్జి చూపించి ఉంటే మీరు అసలు ఎన్నికల్లో రెండు సార్లు గెలిచే ఉండేవారా?' అంటూ పొన్నాడపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

జనసేనకే ఛాన్స్

- పి.గన్నవరంలో వైస్ ఎంపీపీకి నేడు ఎన్నిక

పి.గన్నవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో ఇద్దరు వైస్ ఎంపీపీలకు జరగనున్న ఎన్నిక ఆసక్తికరంగా మారింది. గతంలో జెంటిల్‌మెన్ ఒప్పందం ప్రకారం జరిగిన రాజకీయ పరిణామాల్లో ఎంపీపీ, వైస్‌ఎంపీపీలు రాజీనామాలు చేయగా ఎంపీపీ, ఒకవైస్‌ఎంపీపీ ఎన్నికల పూర్తయింది. మిగిలిన మరో వైస్ ఎంపీపీకి గురువారం ఎన్నిక నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కాగా పి.గన్నవరం మండలపరిషత్ పరిధిలో 22 ఎంపీటీసీలు ఉండగా వారిలో టీడీపీ-7, జనసేన-5,వైసీపీ-9, బీఎస్పీ-1 ఎంపీటీసీలు ఉన్నారు. ప్రస్తుతం జనసేన ఎంపీటీసీ ఎంపీపీగాను, టీడీపీ ఎంపీటీసీ వైస్‌ఎంపీపీగాను కొనసాగుతున్నారు. మరో వైస్ ఎంపీపీని జనసేన చెందిన కుందాలపల్లి ఎంపీటీసీ పప్పుల సాయిబాబుకు ఇచ్చేందుకు కూటమి పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. 9మంది ఎంపీటీసీలున్న వైసీపీ కూడా ఎన్నిల బరిలో నిలుస్తోంది.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్

- 28లోగా నమోదు చేసుకోవాలి
- జిల్లా సాంఘిక సంక్షేమశాఖ

అమలాపురం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వనున్నామని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు. ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు సంబంధించి జ్ఞానభూమి పోర్టల్‌లో సంబంధిత వెబ్‌సైట్‌లోని పోర్టల్‌లో వెబ్‌ఆప్షన్లు ఇచ్చారని, ఈనెల 28వతేదీ వరకు పేర్లను నమోదు చేసుకోవచ్చునన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను సకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు. డీఎస్సీ కోచింగ్ షార్ట్ లిస్ట్ చేసిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితాలను సంబంధిత పోర్టల్‌లో ప్రదర్శిస్తారన్నారు. ప్రాధాన్యత ప్రకారం అన్ని కోచింగ్ సంస్థలకు తమ ప్రాధాన్యాలను వెబ్ ఆప్షన్ ద్వారా తెలియచేయాలని కోరారు.

మత్స్యకారులకు ఎన్ఎఫ్‌డీపీ కార్డులు

- జిల్లావ్యాప్తంగా వివరాలు రిజిస్ట్రేషన్
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు సులభతరం

పి.గన్నవరం,మార్చి 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ-యోజన(పీఎం-ఎంకేఎస్ఎస్‌వై) పథకాన్ని రూపొందించింది. ఈ పథకంలో భాగంగా మత్స్యకారుల వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి నేషనల్ ఫిషరీష్ డిజిటల్ ప్లాట్ ఫామ్(ఎన్ఎఫ్‌డీపీ)ను ఏర్పాటు చేసింది. ఈ పోర్టల్ ద్వారా మత్స్యకారుల సమగ్ర డేటాను సేకరించి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం తాత్కాలిక సర్టిఫికెట్ అందించి ధ్రువీకరణలోభాగంగా పలు అంశాలను పరిశీలించి పర్మినెంట్ సర్టిఫికెట్ అందజేస్తారు. అత్యధిక మత్స్యకార జనాభా కల్గిన లంకల గన్నవరంలో మత్స్యకారులకు ఎన్ఎఫ్ డీపీలో జిల్లాకో-ఆర్డినేటర్ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్లు చేశారు.



లంకలగన్నవరంలో మత్స్యకారులను రిజిస్ట్రేషన్ చేస్తున్న దృశ్యం

రిజిస్ట్రేషన్‌కు ఉండాల్సిన అర్హతలు

మత్స్యకారులు, చేపలు(అక్వాకల్చర్) రైతులు, చేపల కార్మికులు, చేపల విక్రేతలు, మత్స్య సంబంధ పనులు చేసేవారితోపాటు యాజమాన్య సంస్థలు, కంపెనీలు, సొసైటీలు (ఎస్‌హెచ్‌సీలు), చేపలపెంపకం ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ఎఫ్‌పీవోలు), చేపల పెంపకం చేసేవారు లబ్ధిదారులుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

ఉపయోగాలు ఇవీ

కేంద్రప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం రూపొందించే ప్రతి సంక్షేమ పథకానికి ఆధార్‌కార్డు మాదిరిగా ఎన్ఎఫ్‌డీపీ కార్డు ఉపయోగపడనుంది. కేంద్రం అందించే సబ్సిడీలకు కూడా ఈ కార్డే కీలకంగా ఉండనుంది. చేపల ఉత్పత్తి, వనరుల లభ్యత, మార్కెట్ ట్రెండ్‌లపై రియల్ టైమ్ డేటాను సేకరించడానికి ఈ కార్డుద్వారా వీలు కల్గుతుంది. కాగా జిల్లావ్యాప్తంగా 11,789 రిజిస్ట్రేషన్లు పూర్తికాగా వాటిలో వ్యక్తిగత రిజిస్ట్రేషన్లు 11,743, వివిధ సంస్థలకు సంబంధించి 46 రిజిస్ట్రేషన్లు జరిగినట్టు అధికారులు చెప్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారుగా రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని మిగిలిన గ్రామాల్లోను రిజిస్ట్రేషన్లు పూర్తిచేస్తామని అధికారులు వెల్లడించారు.

ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ వేగవంతం

- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

అమలాపురం రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులప్రక్రియను వేగవంతం చేస్తున్నట్టు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు,బకాయిల విడుదలకు చర్యలు చేపట్టినట్టు వివరించారు. అమలాపురం ఆర్టీసీ డిపోను బుధవారం ఆయన తనిఖీ చేసి గ్యారేజీలో ఏర్పాటు చేసిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అమలాపురం డిపో గ్యారేజీ అన్నిపేరామీటర్లలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యాలను సాధించినందుకు సిబ్బందిని ఆయన అభినందించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళాకు అమలాపురం డిపోనుంచి ప్రత్యేకబస్సులను ఆపరేట్ చేసి ఆర్టీసీ కీర్తిని ఇతర రాష్ట్రాలకు చేరవేసినందుకు ప్రత్యేకంగా అభినందించారు. జిల్లానుంచి కుంభమేళాకు వెళ్లిన డ్రైవర్లను, గ్యారేజ్, ట్రాఫిక్ ఉత్తమ ఉద్యోగులకు ఎండీ ద్వారకా తిరుమలరావు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. కుంభమేళాయాత్రకు ప్రత్యేక బస్సులు పంపేందుకు కృషిచేసిన జిల్లా ప్రజారవాణాధికారిని అభినందించారు. గ్యారేజీ ఆవరణలో మొక్కలు నాటారు.కార్యక్రమంలో డిపోమేనేజర్ చల్లాసత్యనారాయణమూర్తి, ట్రాఫిక్ సూపర్‌వైజర్ ప్రతిమాకుమారి, అసిస్టెంట్ ఇంజనీర్ రామలక్ష్మీదేవి, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ వరహాలబాబు పాల్గొన్నారు.



అమలాపురం డిపోలో ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఆర్టీసీ ఎండీ

ఆహా..రం!





ఆరోగ్యమే మహాభాగ్యం.. ప్రస్తుతం చాలా మంది నోట ఈ మాట వింటున్నాం.. ఆరోగ్యం వస్తుందంటే ఖర్చుకు అసలు వెనుకాడడంలేదు.. ఎంతయినా ఖర్చు పెడుతున్నారు.. ఆహారం తింటున్నారు.. దానికి డ్రైఫ్రూట్స్ వినియోగమే కారణం.. కొవిడ్ తర్వాత అమ్మకాలు అమాంతం పెరిగిపోయాయి.. ప్రతి నెలా బడ్జెట్ లో డ్రైఫ్రూట్స్ చేరిపోయాయి.. అంతే కాదు.. ఆన్‌లైన్‌లో అమ్మకాలు వచ్చేశాయి.. దానికి తగినట్టు దుకాణాలు వెలిశాయి.. ప్రస్తుతం రంజాన్ మాసం కావడంతో ముస్లింలు ఎక్కువగా వినియోగిస్తారు.. అసలు డ్రైఫ్రూట్స్ తింటే ఉపయోగం ఏంటి.. అందులో ఉన్న రహస్యమేంటి అనేదానిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ధరలిలా..

ఖర్జూరం కిలో రూ.90 నుంచి రూ.3 వేల వరకూ ఉంటాయి. నాణ్యత, రుచిని బట్టి రేటు ఫిక్స్ చేస్తారు. బాదం, పిస్తా వంటి ధరలు కిలో రూ.1,000 నుంచి రూ.1600 పైనే ఉంటాయి. అరబ్ దేశాల్లోను నాణ్యత గ్రేడింగ్ ఉంటుంది. నెంబర్-1 క్వాలిటీ గ్రేడ్-1 ధర ఎక్కువగా ఉంటే నెంబర్ 2, 3 గ్రేడింగ్ ధర తక్కువగా ఉంటుంది. దీన్ని బట్టి రేటు ఉంటుంది. అంజీర, పిస్తా, బాదం, అక్రూట్ తదితర రకాలు కేజీ రూ.వెయ్యిపైనేఉంటాయి.



జీడిపప్పు.. ఎక్కడెక్కడి నుంచంటే..

జీడిపప్పును ఇంతకు ముందు శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి దిగుమతి చేసుకునేవారు. ప్రస్తుతం అక్కడి రోస్టెడ్ జీడిపప్పుపై బ్యాన్ విధించడంతో అక్కడి నుంచి బాయిల్డ్ జీడిపప్పును మాత్రమే దిగుమతి చేసుకుంటున్నారు. కోనసీమ జిల్లాలోని మలికిపురం మండలం మోరి నుంచి, ప్రకాశం జిల్లా వేటపాలెం నుంచి జీడిపప్పును తెచ్చి విక్రయిస్తున్నట్టు డ్రైఫ్రూట్స్ వ్యాపారులు చెబుతున్నారు. 320 కౌంట్ ధర (కిలోకి 320 పిక్కలు తూగుతాయి) ధర రూ.900-1100 మధ్య ఉంటుంది. 220 కౌంట్ ధర రూ.1100-1300 మధ్య ఉంటుంది. 180 కౌంట్ ధర రూ.1500-1800 వరకు ఉంటుంది.

- పెరిగిన డ్రైఫ్రూట్స్ వినియోగం
- పట్టణాలు.. పల్లెల్లోనూ దుకాణాలు
- రంజాన్‌లో ముస్లింలకు అదే ఆహారం
- ఎక్కడెక్కడి నుంచో దిగుమతులు
- కొవిడ్ తరువాత నుంచి ప్రజల్లో చైతన్యం
- అంతగా అమ్మకాల్లేవంటున్న వ్యాపారులు



డ్రై ఫ్రూట్స్..ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్‌మిస్, అంజీరా, ఖర్జూరం వంటి డ్రైఫ్రూట్స్ వినియోగం బాగా పెరిగింది. ఒకప్పుడు ధనికుల ఇళ్లల్లోనే ఎక్కువగా కనిపించేవి. ఉన్నత వర్గాలు వీటిని తినడం స్టేటస్ సింబల్‌గా భావించేవారు.మారుతున్న జీవన పరిస్థితుల్లో ఆరోగ్యంకోసం సాధారణ, మధ్యతరగతి ప్రజల్లోనూ వీటి వినియోగం కొంత పెరిగింది. డాక్టర్లు,ప్రకృతి వైద్యులు వీటిని తీసుకోవాలని ఎక్కువగా సూచిస్తుండడంతో చాలా మందికి డ్రైఫ్రూట్స్ దైనందిన జీవనంలో ఒక భాగంగా మారిపోయింది. ప్రధానంగా కరోనా మహమ్మారి తర్వాత ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. దీంతో డ్రైఫ్రూట్స్ వినియోగంపట్ల చైతన్యం పెరిగింది.ఖర్చుకు వెనుకాడడం లేదు.ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్స్, ఖనిజాలు పుష్కలంగా లభిస్తుంది. వీటి వల్ల ఇమ్యూ నిటీ పెరుగుతుంది.రోగనిరోధక శక్తి పెరుగుతుంది.ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలున్న ఈ డ్రైఫ్రూట్స్ వినియోగం సాధారణ రోజుల్లో కంటే రంజాన్‌వేళల్లో అధికంగా ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం అర్బన్/కాకినాడ

పల్లెలకూ షాపులు..

జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం వంటి ప్రధాన నగరాలతో పాటు అమలాపురం, మండపేట, సామర్లకోట, పెద్దాపురం, రావులపాలెం, రామచంద్రపురం, అనపర్తి పిఠాపురం, పలు గ్రామాల్లోనూ డ్రైఫ్రూట్స్ వ్యాపారం బాగా పెరిగింది. కొవిడ్ తర్వాత ప్రజలు వీటి వాడకాన్ని పెంచారు. అంతకు ముందు అంతంతమాత్రంగా అమ్మకాలు జరిగేవి. కేవలం బాదంపప్పు, జీడిపప్పులను మాత్రమే కొనుగోలు చేసేవారు. కానీ నేడు అన్ని రకాల డ్రైఫ్రూట్స్‌ను కొనేవారి సంఖ్య పెరిగింది. ప్రస్తుతం కాకినాడ నగరంలో పది పెద్ద దుకాణాల్లో ప్రత్యేకించి డ్రైఫ్రూట్స్ మాత్రమే విక్రయిస్తున్నారు. రాజమహేంద్రవరం నగరంలోని శ్రీ వెంకటేశ్వర జనరల్ మార్కెట్, దివాన్‌చెరువు వంటి ప్రాంతాల్లో డ్రైఫ్రూట్స్ షాపులు పెద్దసంఖ్యలో ఏర్పాటయ్యాయి. రాజమహేంద్రవరంలోని మునిసిపల్ స్టేడియం చుట్టూ హోల్‌సేల్ డ్రైఫ్రూట్ షాపులు ఎక్కువగా కనిపిస్తాయి. ఒక్క రాజమహేంద్రవరంలోనే 25 కుపైగా హోల్‌సేల్ వ్యాపారులు ఉన్నారు. నగరాల్లో సాధారణ షాపులతోపాటు మోర్, రిలయన్స్, డీమార్ట్ వంటి షాపింగ్ మాల్స్‌లోను వీటిని ప్రత్యేకించి విక్రయిస్తుండడం విశేషం.

తింటే..ఆరోగ్యం

అరబ్ దేశాల నుంచే భారీగా దిగుమతులు

బాదం, పిస్తా, ఖర్జూరం, అంజీరా, వాల్‌నట్స్, అప్రికాట్ వంటి డ్రై ఫ్రూట్స్ రకాలన్నీ అరబ్ దేశాల నుంచే దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. వాతావరణ పరిస్థితుల రీత్యా మన దేశంలో వీటి సాగు దాదాపుగా లేదు. మనదేశంలో ఒక్క కిస్‌మిస్ మాత్రం కొంత మేర దొరకుతుంది. మహారాష్ట్రలోని షాంఘ్లి నుంచి కిస్‌మిస్ దిగుమతి చేసుకున్నా చాలా తక్కువ క్వాంటిటీలోనే లభిస్తోంది. అరబ్ దేశాలైన ఇరాన్, ఇరాక్‌తో పాటు పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి అరబ్ దేశాల నుంచి ఢిల్లీ, ముంబయికి చెందిన హోల్‌సేల్ వ్యాపారులు డ్రైఫ్రూట్స్‌ను తీసుకొస్తారు. అక్కడి నుంచి వయా హైదరాబాద్ టు రాజమహేంద్రవరం తీసుకొస్తారు. పిస్తా అమెరికా, అరబ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ఎక్కువ అరబ్‌దేశాల నుంచే దిగుమతి అవుతోంది. ఖర్జూరంలో అనేక వెరైటీలు ఉన్నాయి.



అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి..

కొవిడ్ తర్వాత డ్రైఫ్రూట్స్ వాడకం ఎక్కువైన మాట వాస్తవమే. దానికి తగినట్టు షాపులు పెరిగాయి.. గతంలో డ్రై ఫ్రూట్స్ షాపులు చాలా తక్కువగా ఉండేవి. నేడు ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. మాల్స్‌లో కూడా లభ్యమవుతున్నాయి. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు డ్రై ఫ్రూట్స్‌ను ఎక్కువగా వినియోగిస్తారు. అయితే ఈ ఏడాది అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సాధారణ రోజులతో పోల్చితే ఒక్కో ఐటమ్‌కు రెండు, మూడు కిలోలు మాత్రమే అదనంగా వ్యాపారం పెరిగిందన్నారు. - **వ్యాపారి, రాజమహేంద్రవరం**



ఖర్జూరంతో ఆరోగ్యం

ఖర్జూరాలు బరువు పెరగడం, కండరాల అభివృద్ధి,గాయాల నుంచి కోలుకోవడం, రక్తపోటును తగ్గించడం, జీర్ణక్రియను క్రమబద్ధీకరించడం, కంటి ఆరోగ్యం మొదలైన వాటిలో సహాయ పడతాయి. కాల్షియం, కాపర్, ఫోలేట్, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్, నియాసిన్, ఫాస్ఫరస్, పొటాషియం, రిబోఫ్లావిన్, సల్ఫర్, థయామిన్, జింక్, విటమిన్-ఏ లభిస్తాయి. ఖర్జూరంలో శరీరానికి మేలు చేసే వివిధ ఆరోగ్య ప్రయోజనాలు పుష్కలంగా ఉన్నాయి. ఖర్జూరాన్ని రోజూ తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడడమే కాకుండా వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుంది.

ఎన్నెన్నో రకాలు..

ఖర్జూరంలో చాలా రకాలు ఉన్నాయి. డెగ్లట్ నూర్, మెడ్జూల్, ఖాద్రావి, హనీ, బ్లాక్ డేట్, గోల్డెన్ ప్రిన్సెస్,ఒమానీ, కల్మీ, ఖుద్రీ, జహీదీ, హలవీ ఇలా అనేక రకాలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా అమెరీ డేట్స్, అజ్వా డేట్స్, అమెరికన్ డేట్స్, హార్మోనీ డేట్స్ ప్రత్యేకం. రంజాన్ మాసంలో ఖర్జూరానికి ప్రాధాన్యత ఉంది. సూర్యాస్తమయ సమయంలో కుటుంబాలు ఇఫ్తార్‌తో ఉపవాసం విరమిస్తారు. సంప్రదాయక ముస్లింలు మూడు ఖర్జూరాలతో ఉపవాసం విరమించే ఆచారాన్ని గుర్తు చేసుకోవడానికి వీటిని తినడం ద్వారా భోజనం ప్రారంభిస్తారని కాకినాడకు చెందిన డ్రై ఫ్రూట్స్ వ్యాపారి శ్రీనివాస్ తెలిపారు.వీటి ధరలు అజ్వా డేట్స్ ధర 250 గ్రాములు రూ.900, మెడ్జూల్ ధర కిలో రూ.2500, అమెరీ డేట్స్ కిలో రూ.1800 వరకు ఉంటున్నాయి. ఇవి పూర్తిగా ముంబై నుంచి ఇంపోర్ట్ చేసుకుంటున్నట్టుగా వ్యాపారులు చెబుతున్నారు.

సనాతన ధర్మమంటే ఏమిటో చెప్పాలి

● పవన్‌కల్యాణ్‌ను ప్రశ్నించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అమలాపురంటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): చేగువేరా వారసుడిని అని చెప్పి రాజకీయాల్లోకి వచ్చిన పవన్‌కల్యాణ్ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చెప్పినట్టు నడుచుకుంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. నేడు సనాతన ధర్మం గురించి ఆయన మాట్లాడుతున్నారని అసలు సనాతన ధర్మమంటే ఏమిటో చెప్పాలన్నారు. ఇప్పటికే సమాజంలో కులవ్యవస్థ అంతకంతకూ పెరిగిపోతుందన్నారు. సనాతన ధర్మమంటే మనుధర్మాన్ని అమలు చేయడమా అన్నారు. అన్నమయ్య, పోతన, రామానుజాచార్యులు, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి సమతావాదులకు తామంతా వారసులమన్నారు. వారంతా మన జాతి సంపద అని, మేము సగర్వంగా చెప్పుకుంటామని విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. మనుధర్మాన్ని అమలు చేస్తామంటే సహించబోమన్నారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ పచ్చని కోనసీమలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉందన్నారు. పలుచోట్ల పైపులైన్లు, ట్యాప్‌లు వేసినప్పటికీ చుక్కనీరు సరఫరా చేయని దుస్థితి నెలకొందన్నారు. పంటకాల్వలు, డ్రైనేజీలుగా మారిపోయాయని, ఆక్వా కెమికల్ వ్యర్థాలతో వ్యవసాయం కూడా దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన ప్రజా చైతన్య సైకిల్ యాత్రలో ఎన్నో సమస్యలను గుర్తించామన్నారు. సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కనీసం దోమతెరలు కూడా అందించడం లేదన్నారు.మంత్రి నాదెండ్ల మనోహర్ హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యం సరఫరా చేస్తామని హామీఇచ్చి ఇంతవరకు చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా డీఎస్సీ నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. పీ-4 పథకం కేవలం పేదలను బిచ్చగాళ్లను చేయడం కోసమేనని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.బలరామ్, జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

గేట్‌లో యూసీఈకే విద్యార్థుల ప్రతిభ

● 86 మందికి ర్యాంకులు

జేఎన్టీయూకే, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గేట్-2025 పరీక్షల్లో కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకే విద్యార్థులు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎన్. మోహన్‌రావు తెలిపారు. ఈసీఈ విద్యార్థులు సీహెచ్ సాయిచరణ్ 9వ ర్యాంకు, సివిల్ నుంచి ఐదుగురు విద్యార్థులు 1000 నుంచి 20,000లోపు, ఈఈఈ నుంచి 20 మంది 11 నుంచి 50,000లోపు, మెకానికల్ నుంచి 9 మంది 500 నుంచి 10,000లోపు ర్యాంకులు పొందారన్నారు. అదేవిధంగా ఈసీఈ నుంచి 28 మంది 9 నుంచి 50,000లోపు, సీఎస్‌ఈ నుంచి 15 మంది 100నుంచి 50,000లోపు, పీఈ సీఈ నుంచి 9 మంది 50 నుంచి 5000 లోపు ర్యాంకులు సాధించారన్నారు. మొత్తం 86 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

బోటు బిల్డింగ్ యార్డ్ లీజు రద్దుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

● ప్రభుత్వమే నిర్వహణ చేపట్టాలి
● ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు రంగారావు

కాకినాడ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసిన కాకినాడ బోటు బిల్డింగ్ యార్డు లీజు రద్దుచేసి మత్స్యశాఖ ఆధీనంలో ప్రభుత్వమే నిర్వహణ చేపట్టాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు కోరారు. స్థానిక జగన్నాధపురంలోని ఎస్‌ఐఎఫ్‌టీ భవనంలో బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మత్స్య సహకార సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బలసాడి రంగారావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి, డిప్యూటీ డైరెక్టర్ వి.కృష్ణారావు, జిల్లా మత్స్య సహకార సంఘం ఎండీ, అసిస్టెంట్ డైరెక్టర్ కె. కరుణాకరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ప్రధాన మంత్రి మత్స్యకార యోజన పథకాన్ని రెండేళ్లు పొడిగించడంపట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. కాకినాడ ఫిషింగ్ హార్బర్‌లోని ఆప్‌కాబ్ డీజిల్ బంక్ నిర్వహణను జిల్లా మత్స్య సహకార సంఘానికి అప్పగించాలని, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నేతృత్వంలో సీఎంను త్వరలో కలిసి మత్స్యకార సమస్యలు విన్నవించాలని, బోటు బిల్డింగ్ యార్డును ప్రభుత్వమే నిర్వహించాలని తీర్మానాలు చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రంగారావు మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే కొండబాబు హయాంలో రూ.6కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో ఆధునీకరించిన బోటు బిల్డింగ్‌యార్డులో కొన్ని పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, ఈ అభివృద్ధి పనులు పూర్తి చేయించేందుకు ప్రభుత్వం రూ.కోటి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యకార సంఘం వైస్ చైర్మన్ కొల్లు రాంబాబు, కో ఆప్షన్ సభ్యుడు అంపోలు సత్యనారాయణ, బోర్డు డైరెక్టర్లు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో గరుడవాహన సేవ

● కొనసాగుతున్న స్వామివారి అధ్యయనోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలకు ముందుగా నిర్వహించే అధ్యయనోత్సవాలు బుధవారరం రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. వేకువజామునే గోదావరి జలాలను తీసుకువచ్చి స్వామివారికి మేల్కొలుపు నిర్వహించారు. అనంతరం వసంత మండపంలో పండితులు ద్రవిడ వేద పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అనంతరం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అధ్యయనోత్సవాలలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళ కళాకారుల వాయిద్యాలు భక్తులను అలరించింది. సాయంత్రం వేద పారాయణం నిర్వహించారు. మేళతాళ మంగళవాయిద్యాలు నడుమ శ్రీవారు గరుడవాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు నిర్వహించారు. అశేష భక్తజనం పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వాడపల్లిలో గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జీజీహెచ్‌లో మరో జీబీఎస్ కేసు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో వైద్యసేవల కోసం మరో గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైంది. ఒకరు ఆరోగ్యంగా కోలుకోవడంతో బుధవారం డిశ్చార్జి చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. ప్రస్తుతం ఐదుగురు బాధితులు చికిత్స పొందుతున్నారన్నారు. జీబీఎస్ కేసులకు వైద్య చికిత్స, మందులు, వ్యాక్సిన్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి భయాందోళనకు గురవ్వరాదన్నారు.

హుూండీల ఆదాయం రూ.15లక్షలు

ఐ.పోలవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ వీరేశ్వరస్వామి హుండీల ఆదాయం 110రోజులకు రూ.15,73,843లు వచ్చినట్లు ఆలయ ఏసీ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.8,75,849లు, నిత్యకళ్యాణం, కట్నకానుకల ద్వారా రూ6.04లక్షలు, అన్నదానం హుండీ ద్వారా రూ.93,061లు సమకూరినట్టు తెలిపారు. మూడు విదేశీ నోట్లు కూడా వచ్చాయన్నారు. అమలాపురం దేవదాయశాఖ తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో బుధవారం హుండీల ఆదాయం లెక్కించారు.

వర్షపు నీటిని సంరక్షించాలి

» పర్యావరణవేత్త వెంకట యాదవ్
» 'నన్నయ'లో జాతీయ వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలనతో సభను ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అందరూ తమ ఇంటిపై పడిన వర్షపు నీటిని తామే సంరక్షించుకుంటే నీటి కోసం యుద్ధాలు అవసరం లేదని హైదరాబాద్‌కు చెందిన పర్యావరణవేత్త సిద్దనబోయిన వెంకట యాదవ్ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నీటి సంరక్షణ, భవిష్యత్ సవాళ్లు అనే అంశంపై బుధవారం నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌కు వీసీ ఎస్.ప్రసన్నశ్రీ, సిద్దనబోయిన ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతిప్రజ్వలనతో సభను ప్రారంభించారు. సిద్దనబోయిన మాట్లాడుతూ మన ఇంటి కింద 1.50 లక్షల లీటర్ల నీరు పట్టే సంపుతో ఇంటి నిర్మాణం చేపట్టాలని, ఇది నేటి కాలంలో చాలా ప్రాంతాల్లో ఆదర్శంగా నిలిచిందన్నారు. నన్నయ వర్సిటీని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దేందుకు సహకారం అందిస్తామన్నారు. వీసీ మాట్లాడుతూ సరిపడ నీరు తాగకపోతే శరీరంలో అవయవాలు పాడవుతాయన్నారు. యూనివర్సిటీలో నీటిఎద్దడి అధికంగా ఉందని, దానిని అధిగమించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. వెంకటయాదవ్ సహకారంతో పర్యావరణ అభివృద్ధి, నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం పర్యావరణం, నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పోటీల్లోని విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. రిజిస్ట్రార్ జి.సుధాకర్, వర్సిటీ ఇంజనీర్ కె.నూకరత్నం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాచీన ఆలయాల ఆదాయం రూ.14.91 లక్షలు



బిక్కవోలులో లక్ష్మీగణపతి ఆలయ హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

బిక్కవోలు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన శ్రీలక్ష్మీగణపతి, శ్రీగోలింగేశ్వర స్వామి ఆలయాల హుండీలను బుధవారం లెక్కించగా రూ.14.91లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. రామచంద్రపురం తనిఖీ అధికారి ఆర్.బాలాజీరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో శ్రీలక్ష్మీ గణపతి హుండీల నుంచి రూ.10,97,441, శ్రీగోలింగేశ్వరస్వామి హుండీల నుంచి రూ.3,96,859 ఆదాయ వచ్చిందని తెలిపారు. మూడు నెలల 20 రోజులకుగాను ఈ ఆదాయం లభించినట్టు ఈవో పేర్కొన్నారు.

28, 29 తేదీల్లో ఐడియల్‌లో జాతీయస్థాయి సదస్సు

కాకినాడ రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ సామర్లకోటరోడ్డులోని ఇంద్రపాలెంలాకుల వద్దఉన్న ఐడియల్ డిగ్రీకళాశాలలో ఈనెల 28,29 తేదీల్లో జాతీయస్థాయి సదస్సును నిర్వహించనున్నట్లు కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ సదస్సు చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి తెలిపారు. కళాశాల రసాయన, భౌతికశాస్త్ర విభాగాల ఆధ్వర్యం లో కన్వర్జెన్స్ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఫిజిక్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ నానోమెటీరియల్స్ అండ్ నానో టెక్నాలజీ అనే అంశంపై రెండురోజుల పాటూ ఈ సదస్సు జరుగుతుందన్నారు. దీనిలో ముఖ్యఅతిథులుగా దేశవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన వివిధ విశ్వవిద్యాలయాల సీనియర్ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, పారిశ్రామిక సాంకేతిక నిపుణులు హాజరుకానున్నారని తెలిపారు. వివిధ యూనివర్శిటీలు, కళాశాలల ప్రొఫెసర్లు, అధ్యాపకులు తమ పేపర్లను అందజేయాలని కోరారు. ఈ సదస్సుకు ప్యాట్రన్‌గా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ, కన్వీనర్‌గా కెమిస్ట్రీ విభాగాధిపతి కె.రాజేంద్రకుమార్, సమన్వయకర్తగా ఫిజిక్స్ విభాగాధిపతి జి.రాజు, సహ సమన్వయకర్తగా బి.శ్రీనివాస్, గౌరవ సలహాదారుడిగా ప్రసాద్, నిర్వహణ కమిటీ సభ్యులుగా సిరి, జ్యోతి, సాయి కళ్యాణి వ్యవహరించనున్నారన్నారు.

శృంగారవల్లభస్వామి దేవస్థానం షాపులకు వేలం

● రూ.10.57లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆశీల పాట ద్వారా పంచాయతీకి రూ.10.57 లక్షలు సమకూరినట్లు పంచాయతీ కార్యదర్శి ఒగ్గు భార్గవ్ తెలిపారు. శృంగారవల్లభస్వామి దేవస్థానానికి వచ్చే వాహనాలకు పార్కింగ్ ఫీజు వసూలు నిమిత్తం రూ.6.60 లక్షలకు లక్కరాజు రామకృష్ణ, దుకాణాల నుంచి ఆశీలు వసూలుకు సంబంధించి రూ.3.97లక్షలు దంటు వీరబాబు దక్కించుకున్నట్టు తెలిపారు. సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్రిక్తత... ఉత్కంఠ!

- రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద రోజంతా టెన్షన్ టెన్షన్
- భారీగా మోహరించిన పోలీసులు
- పోస్టుమార్టం అనంతరం పాస్టర్ ప్రవీణ్ మృతదేహం హైదరాబాద్ తరలింపు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్రైస్తవ సువార్తీకుడు ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి నేపథ్యంలో బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద రోజంతా ఉద్రిక్తత, ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన క్రైస్తవ సంఘాల నాయకులు, క్రైస్తవులు, ప్రవీణ్ ఫాలోవర్స్‌తో పాటు తెలంగాణ జిల్లాలు, ఖమ్మం ప్రాంతానికి చెందిన క్రైస్తవ ప్రముఖులు పెద్దసంఖ్యలో ఆసుపత్రికి చేరుకోవడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్ప డ్డాయి. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. ఆసుపత్రి ఆవరణలోని పోలీస్ అవుట్‌పోస్టు సమీపంలో క్రైస్తవ విశ్వాసులు పెద్దసంఖ్యలో మోకాలి ప్రార్థనలతో, నినాదాలతో ప్రవీణ్‌కు న్యాయం జరగాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. అన్ని ఫార్మాలిటీస్ ముగిసిన అనంతరం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో సువార్తీకుడు ప్రవీణ్ పగడాల మృతదేహాన్ని ఒక ప్రైవేట్ అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలించారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ప్రభుత్వ బోధనాసుపత్రికి చేరుకుని శాంతిభద్రతలు, ఇతర అంశాలను పర్యవేక్షించారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూడా ఆసుపత్రికి వచ్చి బాధిత క్రైస్తవ సంఘీయులకు న్యా యం జరిగేలా చూస్తామని ప్రకటించారు. ప్రవీణ్ పగడాల మృతి విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు చేయాల్సిందిగా సీఎం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని, మృతి కారణాలు సాధ్యమైనంత త్వరగా బయటకు వస్తాయన్నారు. కాగా ప్రభుత్వ బోధనాసుపత్రి ఆవరణలోని పోలీస్ అవుట్‌పోస్టులో ప్రవీణ్ మృతదేహానికి శవ పంచనామా జరిపారు. అనంతరం మార్చురీలో పోస్టుమార్టం పూర్తి చేశారు. ఈ ప్రక్రియ మొత్తం సాయంత్రం 4.30 గంటల వరకూ కొనసాగడంతో ఆసుపత్రి ఆవరణతోపాటు మెయిన్‌గేటు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

కేఏ పాల్‌ను అడ్డుకున్న పోలీసులు

సాయంత్రం మూడున్నర ప్రాంతంలో ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ రాజమహేంద్రవరం ప్రభుత్వబోధనాసుపత్రికి చేరుకున్నారు. అక్కడి నుంచి పోస్టుమార్టం జరుగుతున్న మార్చురీగది లోపలకు వెళ్లడానికి ప్రయత్నించగా కేఏ పాల్‌ను పోలీసులు అనుమతించలేదు. ఈ సమయంలో కేఏ పాల్‌కు, మాజీ ఎంపీ హర్షకుమార్ తనయునికి కొంత వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం ఆసుపత్రి మార్చురీ వద్ద కేఏ పాల్ హైడ్రామా కొనసాగింది. ఓపెన్‌టాప్ జీపుపై కేఏ పాల్ తన మద్దతుదారులు, క్రైస్తవ సంఘీయులకు అభివాదం చేస్తూ సువార్తీకుడు ప్రవీణ్ పగడాలది ప్రమాదం కాదని, హత్య అని భావిస్తున్నామని ఆరోపించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కొద్దిరోజులుగా అన్‌నెస్ససరీగా మాట్లాడడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రవీణ్ మర ణం విషయంలో రాష్ట్రంలోని కోర్టుల్లో న్యాయం జరగపోతే అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతామని ఆయన పేర్కొన్నారు. మాజీ ఎంపీ హర్షకుమార్ ఆందోళనా కార్యక్రమం వద్దకు చేరుకుని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌తో మాట్లాడారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని కోరారు. పోస్టుమార్టం కార్యక్రమాలను సైతం పర్యవేక్షించారు.

ఆఖరి క్షణాలు.. ఇలా!

వీడియో కెమెరాల్లో నమోదైన సీసీ ఫుటేజ్ ప్రకారం.. హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై వస్తున్న పాస్టర్ ప్రవీణ్ సోమవారం రాత్రి 11 గంటల 31 నిమిషాలకు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు టోల్ గేటు దాటారు. ఆ సమయంలో బుల్లెట్ హెడ్‌లైటు వెలగడం లేదు. కుడివైపు సిగ్నల్ లైటు మాత్రమే బ్లింక్ అవుతోంది. తర్వాత 11 గంటల 42 నిమిషాల 6 సెకన్లకు(11 నిమిషాలు) బుల్లెట్ నయారా పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుంది(ఈ రెండు ప్రాంతాల మధ్య దూరం 10-11 కిలో మీటర్లు.) సరిగ్గా బంకుకు ఎదురుగా రోడ్డు పైనుంచి ఎడమవైపు గట్టు కిందకు ప్రవీణ్ బుల్లెట్‌తో సహా పడిపోయారు. బుల్లెట్ కింద పడిపోతున్న సమయంలో దాని పక్క నుంచి ఎరుపు రంగు కారు వెళ్తున్నట్టుగా కనిపిస్తోంది. ఆ వెంటనే లారీ కూడా వెళ్లింది.



పాస్టర్ ప్రవీణ్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో భారీ బందోబస్తు మధ్య హైదరాబాద్‌కు తరలిస్తున్న పోలీసులు



మార్చురీ గదిలోకి అనుమతించ లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కేఏ పాల్



పోస్టుమార్టం కోసం ఇంక్వెస్ట్ సిద్ధం చేస్తున్న అధికారులతో మాట్లాడుతున్న హర్షకుమార్



రాజమహేంద్రవరంలో ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

రంగంలోకి ఐదు బృందాలు : ఎస్పీ



పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతి కేసు దర్యాప్తు వేగంగా జరుగుతోందని ఎస్పీ నరసింహ కిశోర్ తెలిపారు. ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో 5 ప్రత్యేక బృందాలు నిజం నిగ్గుతేల్చే పనిలో నిమగ్నమయ్యాయని చెప్పారు. అధునాతన సాంకేతికత సహాయంతో అన్ని కోణాల్లో పరిశీలన చేస్తున్నామన్నారు. పాస్టర్ ప్రవీణ్ చివరిసారి మోహన్‌రావు అనే స్థానిక వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడారని గుర్తించినట్టు తెలిపారు. శవ పరీక్షను వీడియో తీసినట్టు చెప్పారు. ఈ ఘటనపై ఎవరి వద్ద ఎలాంటి సమాచారం ఉన్నా తమకు తెలియజేయాలని కోరారు. వదంతులు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఘటనా స్థలంలో కర్రలపై ఉన్న రక్తపు మరకలను, దుస్తులను ఫోరెన్సిక్ నిపుణులకు పంపించామని ఆయన వెల్లడించారు.

క్రైస్తవులు 29న రాజమహేంద్రవరం తరలిరండి

మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం దురదృష్టకరమని, దీనిపై భవిష్యత్ కార్యాచరణ చేపట్టి రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేసేందుకు ఈనెల 29న రాజమహేంద్రవరం హోలీట్రినిటి చర్చ్ గ్రౌండ్ వద్దకు క్రైస్తవ సోదరులంతా తరలిరావాలని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ పిలుపునిచ్చారు. ప్రవీణ్ పోస్టుమార్టం రిపోర్టు ఈనెల 29న వస్తుందని ప్రభుత్వాసుపత్రి సూపరింటిండెంట్ చెప్పారన్నారు.

ప్రవీణ్ మరణం కలచివేసింది : షఫీ

పాస్టర్ ప్రవీణ్ మరణం తమను కలచివేసిందని అంతర్జాతీయ ముస్లిం మైనార్టీ సువార్తీకుడు షఫీ అన్నారు. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బహిర్గతంచేయాలన్నారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆలస్యంగా వెలుగులోకి ఘటన



పిఠాపురంలో మరణించిన వ్యక్తి

పిఠాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. ప్రమాదానికి కారణమైన కారుతో అందులోని వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈనెల 24న జరిగిన ఈ సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని స్టువర్టుపేట వద్ద గల మారుతి వైన్స్ ఎదురుగా రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. అతడి వయస్సు 60 సంవత్సరాలు ఉంటుంది. బిచ్చగాడిగా పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారుతో అందులోని వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా కారుని, ఆ వ్యక్తులను పోలీసులు గుర్తించారు. పిఠాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో కాలువలో దూకి ఆత్మహత్య

పెరవలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో తూర్పుగోదావరి జిల్లా పెరవలి వద్ద కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం జరగగా బుధవారం మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖండవల్లికి చెందిన చల్లా దుర్గారావు (29)కు భార్యతో విబేధాలు ఉన్నాయి. తరచూ గొడవలు పడుతుండడంతో మనస్తాపం చెందిన దుర్గారావు మంగళవారం పోలీసు స్టేషన్‌కు వెళ్లి అక్కడి నుంచి లాకుల వద్దకు చేరుకుని కాలువలోకి దూకేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



చల్లా దుర్గారావు మృతదేహం

రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ

లారీ చక్రాల కింద పడి ఇద్దరి మృతి

మహిళకు తీవ్ర గాయాలు

జె.కొత్తూరులో ఘోర రోడ్డు ప్రమాదం

జగ్గంపేట రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట రూరల్ మండలం జె.కొత్తూరు గ్రామంలో వినాయకుని గుడి వద్ద బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గోకవరం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన బొందల నాగు(28) తన సోదరితో కలిసి బైక్ పై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఆ సమయంలో జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామానికి చెందిన ఇల్లా వరహాలు(48) జగ్గంపేట వైపు వెళుతున్నాడు. జె.కొత్తూరు వినాయక గుడి వద్దకు వచ్చేసరికి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు రోడ్డుపై పడిపోవడంతో వెనుక నుంచి వస్తున్న లారీ వీరి మీద నుంచి దూసుకుపోయింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళ కాలు పై నుంచి లారీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను జగ్గంపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ రఘునాథరావు పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.



మరణించిన నాగు (ఫైల్‌ఫొటో)

ఫొటోషూట్‌కు వచ్చి... ప్రాణాలు విడిచి

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి

ఆత్రేయపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఫొటోషూట్ కోసం వచ్చిన యువకుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొత్తతుంగపాడు గ్రామానికి చెందిన ఆలపాటి కిషోర్(19) పదోతరగతి చదువుకుని కూలీ పనిచేసుకుంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం తన స్వగ్రామంలోని బంధువుల ఇంట జరిగిన శుభకార్యానికి వెళ్లి సందడి చేశాడు. అక్కడే ఉన్న తన మిత్రులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక వద్దకు చేరుకున్నారు. కాటన్‌బ్యారేజీ, పిచ్చుకలంక గోదావరి నదితీరంలో ఉల్లాసంగా గడిపారు. ప్రకృతి అందాలు ఇసుక తిన్నెలలో ఫోటోషూట్‌లు తీసుకున్నారు. సాయంత్రం వరకు అక్కడే స్నేహితులతో గడిపి గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. గోదావరిలో స్నానం చేసిన కిషోర్ ఊబిలో కూరుకుపోయాడు. బంధుమిత్రులు సంఘటనా స్థలానికి చేరుకుని మత్స్యకారుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. కూరుకుపోయిన చోట రాత్రి కిషోర్ మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలిసిన వెంటనే ఎస్ఐ ఎస్.రాము ఘటనా స్థలానికి చేరుకున్నారు. శవపంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కిషోర్ తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కిషోర్ మృతదేహం వద్ద బంధుమిత్రుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.



ఆలపాటి కిషోర్(ఫైల్)

గోదావరిలో దూకి యువకుడి గల్లంతు

రాజానగరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరానికి చెందిన మునసా వీరబాబు (19) బుధవారం రాజమ హేంద్రవరంలో రోడ్డు కం రైలు వంతెనపై నుంచి దూకి గల్లంతయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. రాజానగరంలోని న్యూకాలనీకి చెందిన వీరబాబు రాజమహేంద్రవరంలోని ఆటో నగర్‌లో కారు మెకానిక్ పని నేర్చుకుంటున్నాడు. రోజు మాదిరిగానే పనిలోకి వెళ్తున్నానని చెప్పిన వీరబాబు బుధవారం ఉదయం 6గంటలకు రాజానగరంలోని వెంకీ అనే మిత్రుడితో కలిసి బైక్‌పై ఇంటి వద్ద నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో వీరబాబు పనిలోకి రాలేదని మెకానిక్ షాపు నుంచి ఇంటికి ఫోన్ వచ్చింది. దీంతో ఎక్కడికి వెళ్లాడని ఆరా తీస్తే రంపచోడవం పార్టీకి వెళ్లినట్టుగా తెలుసుకున్నారు. రంపచోడవరం నుంచి తిరుగు ప్రయాణంలో కోరుకొండ లోని సమీప బంధువుల ఇంటికి బుధవారం సాయంత్రం 4గంటల సమయంలో వెళ్లి వారితో కొద్దిసేపు మాట్లాడిన వీరబాబు కొంతసొమ్ము అడిగి తీసుకున్నట్టు తెలుస్తోంది. అక్కడి నుంచి రాజమహేంద్రవరం చేరుకుని మేనత్త ఇంటికి వెళ్లి అక్కడి నుంచే ఫోన్‌లో ఎక్కువసేపు మాట్లాడినట్టు తెలుస్తోంది. అనంతరం ఫోన్ తన స్నేహితుడికి ఇచ్చి తాను గోదావరిలో దూకేస్తున్నానని ఈ విషయం తన అన్నయ్యకు చెప్పమన్నాడు. దీంతో ఆందోళన చెందిన స్నేహితుడు వెంకీ ఎంత వారించినా వినకుండా వీరబాబు ఒక్కసారిగా గోదావరిలో దూకేశాడు. స్నేహితుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు రాజానగరంలోని కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. కుటుంబ సభ్యులు రాజమ హేంద్రవరం హుటాహుటీన బయలుదేరి వెళ్లారు.



మునసా వీరబాబు (ఫైల్)

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

అన్నవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2చోరీ కేసుల్లో నిందితుడిని పట్టుకుని 90గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. గతేడాది డిసెంబరులో కత్తిపూడిలోని ఓ ఇంటి తలుపులు పగలుగొట్టి బంగారు ఆభరణాలు దొంగిలించగా, ఈ ఏడాది ఫిబ్రవరి 10న జాతీయ రహదారిపై ఉన్న నమూనాలయం వద్ద బస్సులో ప్రయాణించే మహిళ మెడలో నగలు దొంగిలించిన కేసులో గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన బైసాని సందీప్‌ను కత్తిపూడి బ్రిడ్జి వద్ద బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. చోరీ చేసిన బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.7.20 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ హరిబాబు తదితరులున్నారు.

ఆర్టీసీ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యుల

అభ్యున్నతికి కృషి

సొసైటీ చైర్మన్ ద్వారకా తిరుమలరావు



అమలాపురంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ, సొసైటీ చైర్మన్ తిరుమలరావు

అమలాపురం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని ఆ సంస్థ ఎండీ, సొసైటీ చైర్మన్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.96కోట్ల బకాయిల విడుదలకు కృషి చేస్తున్నట్టు ప్రకటించారు. గతంలోనే బకాయిలు విడుదల చేయాలని అప్పటి ప్రభుత్వానికి సూచించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వంతో బకాయిలు విడుదల కోసం చర్చించానని, త్వరలోనే విడుదల కానున్నట్టు తెలిపారు. సభ్యులంతా సమన్వయంతో పనిచేస్తూ సొసైటీని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఏబీసీడీ ఫుడ్ కోర్టు భవనంలో బుధవారం సొసైటీ కార్యదర్శి టి.త్రాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్, వైస్‌చైర్మన్, ఈడీ జి.నాగేంద్రప్రసాద్, ఫైనాన్స్ అండ్ ఆడిట్ ఈడీ ప్రసాద్, కార్యదర్శి టి.త్రాసు మాట్లాడారు. ప్రతీ ఆరునెలలకు ఒకసారి సమావేశం నిర్వహించడం జరుగుతుందని, తొలి సమావేశాన్ని విజయవాడలో నిర్వహిస్తామని, కోనసీమలో తొలిసారిగా రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించామన్నారు. 1952లో సొసైటీని ఏర్పాటు చేసి సంఘ సభ్యుల నుంచి డిపాజిట్లు సేకరించడంతో పాటు అవసరమైన వారికి రుణాలను అందిస్తున్నామన్నారు. తిరుమలరావు మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ ఆసియా ఖండంలోనేనంబర్‌వన్ స్థానంలో నిలిచిందన్నారు. 46వేల మంది సభ్యులతో రూ.2500 కోట్ల టర్నోవర్‌తో సొసైటీ ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సంఘ సభ్యుల పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు రుణాలను అందిస్తున్నామన్నారు. క్రెడిట్ సొసైటీ భవనం నిర్మాణం విషయంలో ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ల ప్రతినిధుల మధ్య వివాదం జ రగగా కొద్దిసేపు సమావేశంలో గందరగోళం ఏర్పడింది. అనంతరం త్రాసు ఆధ్వర్యంలో పలు తీర్మానాలను ఆమోదించారు. 230 మంది డెలిగేట్స్ హాజరైన సమావేశంలో కమిటీ సభ్యులు శ్రీనివాసరాజు, అనంతరామయ్య, వి.ప్రసాద్, వినోద్ పాల్గొన్నారు.

వెంటిలేటర్ పైనే అంజలి

కొన ఊపిరితో

కొట్టుమిట్టాడుతున్న విద్యార్థిని

ఆశగా ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తనకు జరిగిన అన్యాయానికి మనస్తాపం చెంది ఇంజక్షన్ చేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన ఎన్.అంజలి రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఐసీయూలో వెంటిలేటర్‌పై ఊపిరి తీసుకుంటుంది. కిమ్స్ ఆసుపత్రిలో పనిచేసే ఏజీఎం దీపక్ మోసం చేయడంతో అంజలి ఈనెల 23న ఆసుపత్రిలోనే మత్తు ఇంజక్షన్ తీసుకుని అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమె డైరీలో రాయడంతో తన ఆవేదన బయటపడింది. దీనిపై విద్యార్థి సంఘాలు, బంధువులు స్పందించి ఆందోళనకు దిగాయి. తండ్రి ఫిర్యాదు మేరకు ప్రకాష్‌నగర్ పోలీసులు స్టేషన్‌లో దీపక్‌పై కేసు నమోదు చేశారు. దీపక్ కుటుంబంతో సహ పరారీలో ఉన్నాడు. మరోపక్క ఆసుపత్రి వద్ద పరిస్థితి అనుక్షణం ఆందోళనకరంగా ఉంది. అంజలి పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. 3రోజులుగా అంజలి వెంటిలేటర్‌పై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. ఎన్నో కలలతో ఉన్నతంగా ఉద్యోగంలో స్థిరపడి కుటుంబంతో ఆనందంగా ఉండాలని ఊహించుకుని ఫార్మ్‌డి ఫైనలియర్ చదువుతున్న అంజలి జీవితం ఊహించని మలుపుతిరిగింది. తనకు జరిగిన అన్యాయంపై తిరగబడలేని సగటు యువతిగా బాధలను తట్టుకుని, అవమానాలు దిగమింగుకుని చివరికి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బుధవారం అంజలికి వైద్యులు కొన్ని పరీక్షలు నిర్వహించినట్టు, అయితే ఆమె పరిస్థితిలో ఎటువంటి మార్పులు లేవని తెలిసింది. అంజలి కోసం ఆమె తల్లిండ్రులు ఎదురుచూస్తున్నారు. ప్రకాష్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. దీపక్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆసుపత్రిలో జరిగిన సంఘటనలపై విచారణ జరుగుతుంది.

అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు ఎక్కువై...

ఉరేసుకున్న గర్భిణి



ప్రవల్లిక (ఫైల్)

తాళ్లరేవు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం అత్తింటివారి వేధింపులు ఎక్కువై ఓ గర్భిణి ఉరివేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరం గ్రామానికి చెందిన సలాది ప్రవల్లిక(21)కు కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గండివారిపాలెనికి చెందిన గండి రాంబాబుతో ఏడాది క్రితం వివాహమైంది. ఆమె ప్రస్తుతం 4 నెలల గర్భిణి. గత 5 నెలలుగా అత్తింటివారితో అదనపు కట్నం కోసం గొడవలు జరుగుతున్నాయి. ఇరువర్గాల పెద్దలతో తగువులు జరిగాయి. మంగళవారం ప్రవల్లికపై వేధింపులు ఎక్కువ కావడంతో ఇంట్లో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహ త్య చేసుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. నా కుమార్తెను అత్తింటి వేధింపులతో హత్యచేశారని ప్రవల్లిక తండ్రి సత్యనారాయణ ఆరోపించాడు. ఘటనపై కోరింగ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు.

పసికందు ప్రాణాలు విడిచింది!

ఏలూరు ఆసుపత్రిలో

చికిత్స పొందుతూ మృతి

నల్లజర్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరంలో ఓ శిశువును ఎవరో ముళ్లకంచెలో పడవేయగా కుక్కలు దాడి చేసి గాయపరిచిన విషయం పాఠకులకు విదితమే. మంగళవారం ఈ విషాద ఘటన జరగగా మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉదయం శిశువును 10గంటలకు ఏలూరు ఆసుపత్రిలో చేర్పిస్తే మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య సేవలు అందించడంలో ఆలసత్వం వహించారు. 3 గంటలకు ప్రారంభించిన వైద్య సేవలతో శిశువు అర్థరాత్రి 12గంటల వరకు కొన ప్రాణంతో కొట్టుమిట్టాడింది. చివరికి చికిత్స పొందుతూ మరణించింది. సకాలంలో వైద్య సేవలందించి ఉంటే శిశువు బతికే అవకాశం ఉందని, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పసికందు మృత్యువాత పడిందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.18,90,148

మామిడికుదురు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ హుండీలను బుధవారం లెక్కించగా రూ.18,90,148 ఆదాయంగా వచ్చిందని సహాయ కమిషనర్ ఎం. సత్యనారాయణరాజు తెలిపారు. 36 రోజులకు ఆలయ ప్రధాన హుండీలను లెక్కించగా పై ఆదాయంతో పాటు 8.200 గ్రాముల బంగారం, 13 గ్రాముల వెండి వచ్చినట్టు చెప్పారు.

పాసింజర్ ఆటోను ఢీకొన్న వ్యాన్

తొమ్మిదిమంది మహిళలకు గాయాలు

తాళ్లరేవు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం అంబేడ్కర్‌నగర్ ప్రాంతంలో ప్రయాణిస్తున్న పాసింజర్ ఆటోను బొలేరో వ్యాన్ ఢీకొనడంతో 9 మంది మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. కోరింగ పోలీసుల వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడకు చెందిన 9మంది మహిళలు పాసింజర్ ఆటోలో ప్రయాణమై ఉప్పలగుప్తం గ్రామంలో శుభకార్యానికి వెళ్లారు. సుంకరపాలెం అంబేడ్కర్‌నగర్ రహదారి ప్రాంతంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన బొలేరో వ్యాన్ ఆటోను ఢీ కొనడంతో ఆటో పల్టీలు కొట్టి 9మంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు యానాం ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రవేటు ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉలిక్కిపడ్డ సత్యవాడ

కె.గంగవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సత్యవాడ గ్రామం నుంచి మహిళలు ఆటోలో ఉప్పలగుప్తం వెళుతున్న సందర్భంలో తాళ్లరేవు మండలంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ సంఘటనతో సత్యవాడ గ్రామం ఉలిక్కిపడింది. సత్యవాడకు చెందిన గొట్టి బాల ఉప్పలగుప్తంలో తన మనుమడి చిన్నకార్యం కోసం బయలుదేరింది. సత్యవాడ నుంచి ఆటోలో తనతో పాటు 9మంది కలిసి బయలుదేరి ప్రమాదానికి గురయ్యారు. మందపాటి విజయ కుమారి తలకు బలమైన గాయమైంది. ఆమెకు కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. కొందరు యానాం ఆసుపత్రి, మరికొందరు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు స్థానికులు చెప్పారు. ప్రమాదంలో ఎవరికి ప్రాణహాని కలగకపోవడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.



గాయాలపాలైన మహిళలు

రేపటితో పెద్దింట్లమ్మ ఉత్సవాలు ముగింపు

అంతర్వేది, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం చినకొల్లేరు మెండుపాలెంలో ఉన్న శ్రీపెద్దింట్లమ్మవారి జాతర మహోత్సవాలు నెలరోజులుగా దేవదాయశాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నామని అంతర్వేది ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారంతో అమ్మవారి ఉత్సవాలు పూర్తవుతాయన్నారు

చంద్రశేఖర్‌కు ప్రశంసాపత్రం

రాజోలు,మార్చి26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్2025లో ధాన్యం కొనుగోలులో ఉత్తమ సేవలుందించినందుకు చింతలపల్లి సచివాలయం గ్రామ వ్యవసాయ సహాయకుడు బొక్కా చంద్రశేఖర్‌కు అమలాపురంలో జేసీ నిషాంతి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అగ్రికల్చర్ ఏడీఏ రామ్మోహన్, ఏవో మధుకుమార్, వ్యవసాయ సహాయకులు అభినందించారు.

నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యం: ఎమ్మెల్యే

రాజోలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చడమే నా లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శివకోడు, రాజోలు, పొదలాడ, బి.సావరం, కడలిలో జలజీవన్ మిషన్ నిధులు రూ.2 కోట్ల 71లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన ఆరు వాటర్ ట్యాంకులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడిమూలలో 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేశానని తెలిపారు. గుడిమెళ్లంక సబ్‌స్టేషన్ త్వరగా మంజూరు చేయాలని అదనంగా శంకరగుప్తంలో కూడా సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. రాజోలు నియోజకవర్గానికి 250కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని, కాలిపోయిన 50ట్రాన్స్‌ఫార్మర్లను రీప్లేస్ చేయాలని అధికారులను కోరామన్నారు.రాజోలులో 33/11సబ్‌స్టేషన్‌లో ఐదు ఎంవీఏ పీటీఆర్‌ను 8ఎంవీఏపీటీఆర్‌గా ఇంప్రూవ్ చేయాలని కోరామని తెలిపారు. రూ.1650 కోట్లతో ధవళేశ్వరం గోదావరి నుంచి నేరుగా పైపులైను ద్వారా నీరు సరఫరా చేసి సురక్షిత మంచి నీరు అందించే పథకం త్వరలోనే మంజూరు కాబోతుందని, దీని ద్వారా మంచినీటి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ కేతా శ్రీను, చాగంటి స్వామి, సూరిశెట్టి శ్రీనివాస్, గుబ్బల ఫణికుమార్, సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు, కడలి సత్యనారాయణ, కడియం రమాదేవి, చొప్పల గుణనాథ్, సీనియర్ టీడీపీ నాయకుడు కసుకుర్తి త్రినాథస్వామి, కాండ్రేగుల కుసులుడు, కాండ్రేగుల సత్యనారాయణ, కాండ్రేగుల స్వామి, కృష్ణ, మానుకొండ దుర్గాప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ వీఎస్ రాజన్, తహశీల్దార్ ప్రసాద్, ఈవోపీఆర్డీ రెహ్మాన్ పాల్గొన్నారు.


పొదలాడలో వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

ఆక్వా గ్రామసభలో రచ్చరచ్చ.. ఇరు వర్గాల ఘర్షణ

ఉప్పలగుప్తం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సన్నవిల్లి ఆక్వా గ్రామ సభలో రెండు వర్గాలు దెబ్బలాడుకున్నాయి. ఆక్వా సాగు అంశం కోర్టులో ఉండగా గ్రామ సభ ఏమిటంటూ ఒక వర్గం, ఆక్వా జోన్‌లో ఉండి కూడా ఎన్నో ఏళ్లుగా సాగు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని మరో వర్గం పరస్పరం అధికారుల సమక్షంలో గొడవకు దిగారు. పోలీసుల జోక్యంతో పరిస్థితి కొంత మేర సద్దుమణిగింది. 2010లో ఆక్వా సాగు ప్రారంభిస్తే ఇప్పుడు అడ్డుకోవడమేమిటని మహిళలు వాదించారు. బుధవారం సర్పంచ్ చిక్కం జంగమయ్య అధ్యక్షతన ఆక్వా గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో 70ఎకరాల చెరువులు ఆక్వా జోన్‌లో ఉన్నాయని కరెంటు రాయితీకి సంబంధించి సమస్యలున్నా, కొత్తగా చెరువుల తవ్వుకోవాలన్నా దరఖాస్తులు చేసుకోవచ్చని ఎఫ్‌డీవో బి.హేమానందకుమార్ అన్నారు. వెంటనే ఒక వర్గం గ్రామంలో ఆక్వాసాగు చేయరాదని హైకోర్టు ఉత్తర్వులుండగా గ్రామసభ ఎందుకని ప్రశ్నించడంతో మరో వర్గం ఎదురుతిరిగింది. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు కేకలు వేయడంతో తోపులాట జరిగింది. వెంటనే సర్పంచ్, గ్రామ పెద్దలు, పోలీసులు జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు. ఏమైనా చెప్పాలంటే ఫిర్యాదు రూపంలో సంతకాలతో ఇస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎఫ్‌డీవో చెప్పడంతో రెండు వర్గాలు రాతపూర్వకంగా ఫిర్యాదులు సమర్పించారు. గ్రామసభకు హాజరైన పలువురు మహిళలు కొన్ని సంవత్సరాలుగా తమ భూములపై ఆదాయం లేక ఆర్థిక ఇక్కట్లు పడుతున్నామంటూ ఎఫ్‌డీవో ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. తమకు పుట్టింటి వారు కానుకగా ఇచ్చిన భూములు వ్యవసాయానికి పనికి రాకపోవడంతో 2010లో చెరువులుగా మార్చుకున్నామన్నారు. కనీసం చేపలు పెంచుకునేందుకు అడ్డు చెప్పడంతో ఆదాయం లేక అత్తింట్లో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా సాగుకు వ్యతిరేకంగా ఒక వర్గం రోడ్డుపై ఆందోళన చేసింది. ఆక్వా సాగుకు అనుకూలంగా మరో వర్గం పంచాయతీ ఆవరణలో ఆందోళన చేపట్టింది. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు, వీఆర్వో పెట్టా బాలాజీ పాల్గొన్నారు.


ఆక్వా గ్రామసభలో తలపడుతున్న రెండు వర్గాలు

గోదావరిలో భూములు కలిసిపోతున్నాయి

కేంద్ర అధికారులతో మల్లాడి భేటీ


కేంద్ర అధికారులతో చర్చిస్తున్న మల్లాడి

యానాం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): యానాం ఫ్లడ్ మేనేజ్మెంట్ అభివృద్ధి (వరద పరిరక్షణ గట్టు)కు సబంధించిన పలు అంశాలపై ఢిల్లీలోని కేంద్ర అధికారులతో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమావేశమయ్యారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ వెళ్లిన మల్లాడి అధికారులను కలిశారు. కేంద్ర ప్రజా పనుల శాఖ (సీపీడబ్ల్యూడీ) చీఫ్ ఇంజనీర్ రాయ్, డిప్యూటీ డైరెక్టర్ అశోక్, అసిస్టెంట్ డైరెక్టర్ భరత్‌లను మల్లాడి కలిశారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఈనెల 16న కేంద్రం పలు అంశాలపై నివేదిక కోరగా వాటికి సంబంధించిన అంశాలపై నివేదికలను మల్లాడి సమర్పించారు. ఈసందర్భంగా వారితో మల్లాడి మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా వరదలతో యానాంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రైతులకు సంబంధించిన అనేక వందల ఎకరాలు భూములు కోతకు గురై గోదావరిలో కలిసిపోతున్నాయని వివరించారు. గతంలో గవర్నర్ కిరణ్‌బేడీ పెట్టిన ఇబ్బందుల వల్ల ఈపనులు జరగలేదన్నారు. ప్రతి సంవత్సరం వరదల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈప్రాజెక్టుతో సరిహద్దు ప్రాంతానికి నష్టం వస్తుందని అధికారులకు పలు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈఫిర్యాదులు చేసిన వారు యానాం ప్రాంతం వారు కావడం విశేషమన్నారు. ఇది రాజకీయంగా ప్రాజెక్టు అడ్డుకునేందుకు చేసే ప్రయత్నం తప్ప దీనిలో వాస్తవం లేదన్నారు. దీనిపై కేంద్రం ఒక బృందాన్ని పంపి వాస్తవ పరిస్థితిని తెలుసుకుని త్వరలోనే ఈప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చి కార్యరూపం దాల్చడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను మల్లాడి కోరారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

రాజోలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీసుస్టేషన్ పరిధిలో గామన్ వంతెన రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని రాజోలు క్రైస్తవ నాయకులు, ప్రతినిధులు రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టారని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎల్ రాజు, జి.ఏసురత్నం, టి.బర్నాబాస్, ఎం.రాజు, పి.భాస్కర్, వైఎస్ టోనీ, డి.మనోహర్‌దాస్, ఎస్.రాజు, కె.ప్రభుకుమార్, డీజే రాజు పాల్గొన్నారు.

న్యాయ విచారణ చేయాలని క్రైస్తవ సంఘాల ర్యాలీ

అంతర్వేది, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రంలో పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతి రోడ్డు ప్రమాదం కాదని, న్యాయవిచారణ చేయాలని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గొల్లమందల చిట్టిబాబు, సరెళ్ల విజయ్‌ప్రసాద్, తోటే ప్రతాప్, ఈద రవిరెడ్డి, పలు గ్రామాల పాస్టర్లు, క్రైస్తవ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా క్లయిమ్‌లకు 31 వరకు గడువు

అమలాపురం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అసంఘిత రంగ కార్మికుల జాతీయ డేటాబేస్ ఈ-శ్రమ్ పోర్టల్‌లోని ఎక్స్‌గ్రేషియా క్లయిమ్ సెటిల్‌మెంట్ సమయాన్ని జిల్లా మేజిస్ట్రేట్లు ఆమోదించిన క్లయిమ్‌లను స్వీకరించేందుకు ఈ నెల 31వరకు గడువు పొడిగించినట్టు కేంద్ర, ఉపాధి కార్మికశాఖ ప్రకటించిందని జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి బుధవారం తెలిపారు. క్లయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియ ఇతర నిబంధనలు, షరతులు మారవని ఆమె తెలిపారు. ఈ-శ్రమ్ పోర్టల్ ఎక్స్‌గ్రేషియా మాడ్యూల్‌పై క్లయిమ్‌లను ప్రోసెస్ చేయడానికి ఈగడువును పొడిగించినందున అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌లో 46 అర్జీలు

అమలాపురం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై 46అర్జీలను ఆయనకు అందించారు. రైతు బజార్‌కు వెళ్లే మార్గం వద్ద ఉన్న డివైడర్‌ను వెడల్పు చేయడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు, జీబ్రాలైన్లు వేయాలని జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబు అర్జీ అందించారు. రైతు బజార్‌కు వెళ్లడం భారంగా ఉందని, రోడ్డును వెడల్పు చేయడంతో పాటు లైటింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. అమలాపురం నుంచి కాకినాడకు వెళ్లే నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ టిమ్ సర్వీసు బస్సులను జి.వేమవరంలోని జామకాయల తూము వద్ద బస్టాప్ ఏర్పాటుచేయాలని అక్కడే వెంకటేశ్వరస్వామి ఆలయం, జీయర్‌స్వామి ఆశ్రమం ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు నూలు కృష్ణ, అప్పన వీరన్న తదితరులు పాల్గొన్నారు.


క్యాంపు కార్యాలయంలో అర్జీదారుల సమస్య వింటున్న ఎమ్మెల్యే ఆనందరావు

ప్రమాదవశాత్తు పడి మత్స్యకారుడి మృతి

యానాం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): యానాం గౌతమి గోదావరిలో వేట సమయంలో ప్రమాదవశాత్తు పడి మత్స్యకారుడు మృతి చెందాడు. యానాం ప్రాన్స్‌తిప్పకు చెందిన మత్స్యకారుడు నాటి రాజు(51) బుధవారం ఉదయం నావపై వేటకు వెళ్లాడు. బోటుపై వలతో వేటాడుతుండా ప్రమాదవశాత్తు నీటిలో పడిపోవడంతో మునిగిపోయాడు. ఆ సమయంలో వలలో చిక్కుకుని పైకి రాలేకపోయాడని తెలిసింది. అనంతరం మత్స్యకారుడిని పైకితీసి యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అతడు అప్పటికే మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులో ఉండేలా సీసీఎస్ భవనం నిర్మించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్

అమలాపురం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆర్టీసీ ఉద్యోగులందరికీ అందుబాటులో ఉండేలా క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ భవనం నిర్మించాలని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ పాలకమండలి సభ్యులు స్వార్థ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకోవడం తగదని హితవు పలికారు. అమలాపురంలో బుధవారం ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, సీసీఎస్ డెలిగేట్ ప్రతినిధుల సమావేశం జిల్లాశాఖ కార్యదర్శి మేడిద శ్రీను అధ్యక్షతన జరిగింది. విజయవాడ ఆర్టీసీ బస్టాండుకు దూరంగా క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయ భవనాన్ని కొనుగోలు చేసేందుకు ఎన్ఎంయూ చేస్తున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య పేర్కొన్నారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌తో చర్చించి ఆర్టీసీ హౌస్‌లోని ఐదవ అంతస్తులో సీసీఎస్ కార్యాలయం నిర్మించుకోవాలన్నారు. క్రెడిట్ సొసైటీ కార్యాలయాన్ని ఏకపక్షంగా ఆర్టీసీ ఉద్యోగులకు దూరంగా తరలించాలని చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జోనల్ కార్యదర్శి వైఎస్ రావు, జోనల్ ప్రతినిధులు టీవీఎస్ నారాయణ, ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు పి.సత్తిబాబు, ప్రతినిధులు జార్జిబాబు, సత్యానందం, జి.చిరంజీవి, జిల్లాలోని వివిధ డిపోల కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహావిహార్ బాధ్యతలను బౌద్ధులకే అప్పగించాలి


ఈదరపల్లిలో బుద్ధగయ విముక్తికై చేపట్టిన ర్యాలీలో కాశి రాంబోధి తదితరులు

అమలాపురం రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బౌద్ధులకు వ్యతిరేకంగా బీహార్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 1949 బీటీఎం యాక్టును తక్షణం రద్దు చేయాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా శాఖ అధ్యక్షుడు కాశి రాంబోధి డిమాండ్ చేశారు. బుద్ధగయ మహాబోధి-మహావిహార్ పూర్తి బాధ్యతలను బౌద్ధులకే అప్పగించి వారి మనోభావాలను కాపాడాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బౌద్ధ ఆరామాలను సంరక్షించడంతో పాటు వాటి అభివృద్ధికి తోడ్పడాలని డిమాండ్ చేశారు. బుద్ధగయ మహాబోధి-మహావిహార్ విముక్తి సాధనకై ఈనెల28న విజయవాడలో మహాజ్ఞానదీక్ష చేపట్టామన్నారు. మహాజ్ఞానదీక్షలో భాగంగా బుధవారం ఈదరపల్లి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి పాదయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ములపర్తి సత్యనారాయణ, ఉప్పే సత్యనారాయణ, ఈవీవీ సత్యనారాయణ, సాపే బాలరవి, గెడ్డం భాస్కరరావు, చిలకపాటి సాంబశివరావు, జల్లి శ్రీనివాస్, నక్కా సంపత్‌కుమార్, కడిమి అర్జునరావు, విప్పర్తి భానోజీరావు, గోసంగి సంపదరావు తదితరులు పాల్గొన్నారు.

మూడో విడత పీఎంశ్రీ పాఠశాలల ఎంపిక

రాజోలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీఎంశ్రీ మూడో విడత పాఠశాలలుగా తాటిపాక, శివకోడు, రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలతో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శివకోటి బాలికల గురుకుల పాఠశాల ఎంపికైందని రాజోలు ఎంఈవో ఎస్.మనోహరం తెలిపారు. డీఈవో ఆదేశాలతో సమగ్రశిక్ష సీఎంవో బి.సుబ్రహ్మణ్యం ఎంపికైన పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యార్థుల ప్రగతి, విద్యార్థుల సంఖ్య, పాఠశాల భౌగోళిక పరిస్థితులపై బుధవారం సమగ్ర పరిశీలన చేశారు. సంబంధిత ప్రధానోపాధ్యాయుడితోచర్చించారు. ఈ పీఎంశ్రీ పాఠశాలలకు అత్యాధునిక తరగతి గదుల రూపకల్పన, మౌలిక సదుపాయాల కల్పన, అత్యాధునిక సాంకేతికత కల్పిస్తామని తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌పై శిక్షణ

అమలాపురం రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నెల నుంచి మొదలయ్యే ఉపాధిహామీ పనులను ఏవిధంగా చేయాలో క్లస్టర్ ఏపీడీ డి.రాంబాబు వివరించారు. అమలాపురం మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రూప్‌మేట్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ మొబైల్ మోనిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) ద్వారా ఉపాధి కూలీల మస్తరు అటెండెన్స్ ఏవిధంగా పంపించాలి, చేసిన పనిలో కొలతలు ఏవిధంగా తీయాలి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. 117 మంది మేట్స్ శిక్షణలో పాల్గొనగా ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, ఏపీవో శివకుమారి, జేఈ సునీత, సత్యసూరిబాబు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై ప్రత్యేక దృష్టిసారించాలి

అంబాజీపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలని ఐసీడీఎస్ సీడీపీవో విజయశ్రీ అన్నారు. ముక్కామల జడ్పీ హైస్కూల్‌లో పోషన్ బీ పడాయి బీపై బ్యాచ్-2 అంగన్‌వాడీ కార్యర్తలకు జరుగుతున్న శిక్షణా తరగుతులు బుధవారంతో ముగిశాయి. ఈసందర్భంగా సీడీపీవో విజయశ్రీ మాట్లాడుతూ ఆరేళ్లలోపు పిల్లల్లో సమగ్ర అభివృద్ధిని నిర్ధారించడానికి మహిళా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రూపొందించిన కార్యక్రమంలో నవ చేతన, ఆదర్శ శీల, దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణపై అంగన్‌వాడీలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. సూపర్‌వైజర్లు వీఎస్వీ మహాలక్ష్మి, వెర్నెమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసుని కల్యాణం

అంబాజీపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఇసుకపూడి జక్కంశెట్టివారిపాలెంలో ఉన్న శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వేదపండితులు సుసర్ల బుజ్జి మంత్రోచ్చారణలతో ఆలయ అర్చకులు ఖండవిల్లి వెంకటరమాణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి దివ్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం నిర్వహించారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

బాలల సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురంటౌన్, మార్చి26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయ మండలిలో సభ్యులను నియమించేందుకు అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా పర్యవేక్షణాధికారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధిబాలల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రక్షణ, ఆదరణ కరువైన పిల్లలు, నేరారోపణ చేయబడిన పిల్లల కేసులను పరిష్కరించేందుకు కోనసీమ జిల్లాలో ఆయా కమిటీలను నియమించనున్నట్టు తెలిపారు. అర్హతగల అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో వివరాలు చూసుకుని దరఖాస్తులు డౌన్లోడ్ చేసుకుని ఏప్రిల్ 9వ తేదీలోగా డైరెక్టర్, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలశాఖ విజయవాడ కార్యాలయానికి పంపించాలన్నారు.

నేడు ఓఎన్జీసీ అధికారులతో చర్చలు

అల్లవరం, మార్చి26(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు గ్రామదత్తత తీసుకోవాలని, స్థానిక యువతకు ఉపాధి వంటి డిమాండ్లపై గ్రామస్తులు చేపట్టిన ఆందోళన నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఆర్డీవో మాధవి, ఓఎన్జీసీ అధికారులతో చర్చలు జరుగుతాయని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు తెలిపారు. ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద గ్రామస్తులు చేపట్టి 24వరోజు దీక్షా శిబిరాన్ని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, టీడీపీ నేత పచ్చిమాల ఏడుకొండలు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయనతో పాటు కొప్పాడి వెంకటరామకృష్ణారావు, నాతి లెనిన్‌బాబు, పెమ్మాని వెంకటరామారావు, మహిళలు 24వ రోజు రిలే దీక్షల్లో నిరసన తెలిపారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దేవ

రాజోలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తాటిపాక లేస్‌పార్కు భవనంలో గ్లోబల్ స్టార్ రామచరణ్‌తేజ్ పుట్టినరోజు ఉత్సవాల్లో భాగంగా రాజోలు తాలూకా చిరుపవన్ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుపవన్ సేవాసమితి ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. 72మంది రక్తదానం చేసిన అభిమానులను ఆయన అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, గుబ్బల ఫణికుమార్, సూరిశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, గుండాబత్తుల తాతాజీ, దిరిశాల బాలాజీ, ఉపసర్పంచ్ కటికిరెడ్డి బుజ్జి, చాగంటి స్వామి, పినిశెట్టి బుజ్జి, ఉలిశెట్టి లక్ష్మణరావు, పోతు కాశీ, కోళ్ల బాబి, వడ్లమూడి చిన్నీ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలి

యానాం,మార్చి 26(ఆంధ్రజ్యోతి): యానాంలో పారిశుధ్య సంస్థకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నెల రోజులుగా యానాంలో డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా ఉందని, దీనిపై చర్యలు తీసుకోకపోతే యానాంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని స్పీకర్‌కు ఎమ్మెల్యే వివరించారు. కనీసం తాత్కాలికంగా ప్రభుత్వ స్థలం పరిశీలన చేయకుండా కాలయాపన చేస్తూ అధికారులు సెలవులు పెట్టి వెళ్లిపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. డంపింగ్ యార్డుపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పారిశుధ్య సంస్థకు స్థలం కేటాయించాలని స్పీకర్‌ను ఎమ్మెల్యే అశోక్ కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు

పి.గన్నవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): శిక్షణలో నేర్చుకున్న ప్రతీ అంశాన్ని అంగన్‌వాడీ సెంటర్లలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సీడీపీవో వై.విజయశ్రీ అన్నారు. ఆర్.ఏనుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన పోషణ్-బీ, పడాయి-బీ శిక్షణలో ఆమె మాట్లాడారు. బాలవిద్య ప్రాముఖ్యత, పిల్లల్లో సమగ్ర అభివృద్ధి, పౌష్టికాహార లోపం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. మూడు రోజులు జరిగిన శిక్షణా కార్యక్రమాలు బుధవారంతో ముగిసినట్లు సూపర్‌వైజర్లు తెలిపారు. సూపర్‌వైజర్లు పీఎస్ఎల్ పద్మావతి, ఎస్.పుణ్యవతి, జి.వెంకటలక్ష్మి, పి.జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మస్తర్లలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

పి.గన్నవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో మస్తర్ల విషయంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఏపీడీ మల్లికార్జునరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు మందిరంలో జరిగిన ఉపాధి హామీ మేట్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులపై నిత్యం పర్యవేక్షణ ఉంటుందని, దొంగ మస్తర్లు వేస్తే ఇబ్బందులు పడతారని ఆయన హెచ్చరించారు. ఎంపీడీవో కేవీ ప్రసాద్ మాట్లాడుతూ కొలతలు ప్రకారం పనులు నిర్వహించాలని మేట్లకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ జిల్లా ప్లానిటేషన్ మేనేజర్ ఎం.త్రినాథ్, ఏపీవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ద్వారకా తిరుమలరావు పూజలు

అంతర్వేది, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు బుధవారం విచ్చేశారు. తొలుత ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం అనంతరం వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదం ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ అందించారు. కార్యక్రమంలో సీఐ భీమరాజు, పోతురాజు శ్రీవెంకటకృష్ణ పాల్గొన్నారు.

గోడి గురుకుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

అల్లవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గోడి గురుకుల పాఠశాల, కళాశాలలో రెగ్యులర్ ప్రిన్సిపాల్, వార్డెన్ పోస్టులు ఖాళీలు భర్తీ కాక, ఆఫీసు సిబ్బంది కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎస్ఎంసీ చైర్మన్‌తో పాటు పలువురు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు. ప్రిన్సిపాల్, వార్డెన్‌లు లేక గురుకుల పాఠశాల విద్యార్థులపై ఫలితాలపై ప్రభావం పడుతుందని ఎస్ఎంసీ చైర్మన్ మర్రి నాగదుర్గ, జంగా శ్రీనివాసరావు, జనిపెల్ల రాఘవ, నాగాబత్తుల శ్రీను, రత్నకుమారిలు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. గోడి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్, వార్డెన్ పోస్టుల భర్తీకి కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు.

సర్వేలు పూర్తిచేయాలి: ఎంపీడీవో

అల్లవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బెండమూర్లంక, మొగళ్లమూరు, తుమ్మలపల్లి సచివాలయాల్లో సిబ్బంది హాజరును ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ పరిశీలించారు. వివిధ సర్వేలు త్వరితగతిన పూర్తిచేయాలని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆదేశించారు. బీసీ కార్పొరేషన్ రుణాలు, ఇంటర్వ్యూలు, సెక్రటరీ లాగిన్‌లో పీజీఆర్ఎస్, సిటిజన్ ఫీల్డ్ బ్యాంకు నమోదు, పంచాయతీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు ఎస్.రాజమోహన్, చిక్కం శ్రీనివాస్, పి.సత్యనారాయణపాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి శాంతి కల్యాణం



అంతర్వేది, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బహుళ ద్వాదశిని పురస్కరించుకుని బుధవారం స్వామివారి శాంతి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత అర్చకస్వాములు స్వామి-అమ్మవార్లను పురాతన కల్యాణ మండపం వద్ద ప్రత్యేక సింహాసనంపై ఆశీనులుచేసి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పాణిగ్రహణం, మాంగళ్యధారణతో కల్యాణ తంతు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గోవిందనామాల మధ్య నరసింహస్వామివారి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది.

పీఎంశ్రీ పథకంలో జిల్లాలో 69 స్కూళ్లు ఎంపిక

మామిడికుదురు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద 69 స్కూళ్లను ఎంపిక చేసినట్టు సమగ్రశిక్ష జిల్లా సీఎంవో సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ఆయన మామిడికుదురు ఎంఈవో కార్యాలయంలో ఈపథకంపై ఉపాధ్యాయులతో చర్చించారు. మొదటి విడతగా ఈ పథకం కింద 21స్కూళ్లు, రెండో విడతగా ఐదు స్కూళ్లను ఎంపికచేసినట్టు తెలిపారు. ఈ పథకం కింద స్కూళ్లో సైన్స్ ల్యాబ్, ప్లేగ్రౌండ్, వాకింగ్ ట్రాక్, ఫుట్‌బాల్ కోర్టు, పలు రకాల సదుపాయాలు కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. మూడో విడతలో మామిడికుదురు మండలంలోని పెదపట్నంలంక స్కూల్‌ను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఎంఈవోలు వెంకన్నబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పది పరీక్షలు ప్రశాంతం

ముమ్మిడివరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పది పరీక్షలు జిల్లాలో బుధవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 110 పరీక్షా కేంద్రాల్లో ఫిజికల్ సైన్స్‌కు సంబంధించి 19,132మందికి 19,013మంది (99.38 శాతం) హాజరు కాగా 119మంది గైర్హాజరయ్యారు. వీరిలో బాలురు 9,513 మందికి 9443మంది (99.26 శాతం) హాజరుకాగా 70మంది గైర్హాజరయ్యారు. బాలికలకు సంబంధించి 9,619మందికి 9,570మంది (99.49 శాతం) హాజరుకాగా 49మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరిక్షల పరిశీలనాధికారి ముప్వా రామలింగం రెండు పరీక్షా కేంద్రాలను, డాక్టర్ షేక్ సలీంబాషా ఒక పరీక్షా కేంద్రాన్ని, డీవైఈవో జి.సూర్యప్రకాశం ఐదు పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ ఏడు పరీక్షా కేంద్రాలను, ఎంఈవోలు 9 పరీక్షా కేంద్రాలను తనిఖీ నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ జరగలేదని డీఈవో షేక్ సలీంబాషా తెలిపారు.

నవోదయకు సిరి ఎంపిక



ఐ.పోలవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం నవోదయ విద్యాలయానికి గుత్తెనదీవి సాయిరాం విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థిని పుట్టపర్తి పద్మణిసిరి ఎంపికైనట్టు కరస్పాండెంట్ సలాది శ్రీనివాసరావు తెలిపారు. స్కూల్ కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ మాగాపు సీతారత్నం, ఉపాధ్యాయులు నాటి ధనరాజు, బొమ్మిడి నాగేంద్రవర్మ, బి.శారద, డి.దుర్గ సిరిని అభినందించారు.

ముగిసిన అంగన్‌వాడీ శిక్షణ

మలికిపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పోషణ్ బి-పడాయి బిపై అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులుగా ఇస్తున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం పిల్లలకు ఆరేళ్లలో 85 శాతం మెదడు అభివృద్ధి చెందాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్య జాగ్రత్తలు, ప్రతీ తల్లిదండ్రులకు సలహా ఇవ్వడానికి శిక్షణలో కార్యకర్తలకు వివరించారు. శిక్షణలో సూపర్‌వైజర్లు కె.హైమావతి, సరోజిని, ప్రసన్న పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

మామిడికుదురు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన యువకుడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెదపట్నంలంక గ్రామానికి చెందిన పల్లి కార్తీక్ (19) మామిడికుదురు నుంచి స్వగ్రామం వెళుతుండగా సోమవారం కొర్లగుంట వద్ద జరిగిన ప్రమాదంలో మోటారుసైకిల్ అదుపు తప్పి కొబ్బరిచెట్టును ఢీకొట్టింది. గాయపడ్డ కార్తీక్‌ను అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

బకాయిల విడుదలపై ఉపాధ్యాయుల హర్షం

మలికిపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు రూ.6200కోట్లు బకాయిలు విడుదలచేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు వెంటనే ఉద్యోగుల ఖాతాల్లో బకాయిల సొమ్ము జమ కావడంతో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం బకాయిలుగా వదిలివేసిన పీఎఫ్ ఏజీజీఎల్ఐ టీఎస్ఎస్‌లను సీఎం చంద్రబాబునాయుడు విడుదల చేయడం సంతృప్తి ఇచ్చిందన్నారు. త్వరలోనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిలు, ఐఆర్‌ను 30శాతం ప్రకటించాలని కోరారు. సమావేశంలో అప్పారి రామకృష్ణ, పంగం నీలారావు, కె.సువర్ణరాజు, వై.పద్మనాభం, ఎన్.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో చెల్లిస్తే వడ్డీలో 50శాతం రాయితీ

ముమ్మిడివరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులను ఈనెల31వ తేదీలోపు పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీలో 50శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. పన్నులు చెల్లింపుదారులు దగ్గరలో ఉన్న మీ సేవ కేంద్రాలు, సచివాలయాలు, నగరపంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లలో పన్నులు చెల్లించి వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పన్నులు చెల్లింపుదారుల కోసం సెలవు దినాల్లో కూడా పన్నులు చెల్లించేందుకు వీలుగా కౌంటర్లు తెరచి ఉంటాయన్నారు. ఇంటి వద్ద నుంచే ఈఆర్పీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో కూడా పన్నులు చెల్లించుకోవచ్చునని తెలిపారు.

నూకాలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి



మామిడికుదురు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మామిడికుదురు గ్రామ దేవత నూకాలమ్మవారి జాతరను గురువారం రాత్రి నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరను పురస్కరించుకుని బుట్టబొమ్మలు, తమిళనాడు తంబోలా డప్పులు, కేరళ వాయిద్యాలు, కోబ్రా డ్యాన్సులు, తెలంగాణ బోణాల డ్యాన్సులతో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది విద్యుద్దీపాలతో అలంకరించారు.

మండపేట

ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



అక్రమ భవనంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న ముస్లిం పెద్దలు

మండపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ప్రతి బుధ, గురువారాల్లో ఒకరోజు ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తామని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో ప్రజలు ఆయనకు సమస్యలు తెలిపారు. కలువపువ్వు సెంటరులో వున్న వక్ఫ్ ఆస్తిని ఆక్రమించి అక్రమంగా గత ప్రభుత్వంలో నిర్మించిన భవనాన్ని స్వాధీనం చేసుకుని మసీదుకు అప్పగించాలని పట్టణానికి చెందిన పలువురు ముస్లింలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ మీటర్లపై వచ్చిన ఫిర్యాదుకు ఆయన వెంటనే విద్యుత్‌శాఖ అధికారులను పిలిపించి వారి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇళ్ల స్థలాల సమస్యతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, ఇరిగేషన్ తదితర పలు శాఖల సమస్యలు వచ్చాయి. ఆయా శాఖల అధికారులకు ప్రజల ఫిర్యాదులను వారికి పంపించారు. కార్యక్రమంలో మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ మూర్తి, విద్యుత్ శాఖ, రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాల ఉద్యోగులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

ఆత్రేయపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సారా తయారీ స్థావరాలపై బుధవారం ఎక్సైజ్ ఉన్నతాధికారులు దాడులు చేశారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనరు, ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్, రామ మహేంద్రవరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ లావణ్య ఆధ్వర్యంలో బొబ్బర్లంక గోదావరి లంకలో దాడులు చేశారు. మోటార్ బోటుపై లంకలోకి వెళ్లి సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పది లీటర్ల సారాతో పాటు 25 కిలోల అమ్మోనియాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కాత్యాయని తెలిపారు. ఎక్సైజ్ ఉన్నతాధికారుల బృందం సారా స్థావరాలపై దాడులు చేశారు. ఎక్సైజ్ సీఐ స్వామి, ఎస్ఐలు సతీష్, అన్నవరం, అప్పారావు, సూర్యకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



బొబ్బర్లంక గోదావరి లంకలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.2.73 లక్షలు

ఆత్రేయపురం, మార్చి26(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,73,831 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ముస్తాబవుతున్న అగస్తేశ్వరస్వామి ఆలయం



తాపేశ్వరంలోని అగస్తేశ్వరస్వామి

మండపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తాపేశ్వరంలో వున్న అగస్తేశ్వరస్వామి ఆలయాన్ని గ్రామానికి చెందిన తాపేశ్వరం సురుచి సంస్థల అధినేత పోలిశెట్టి మల్లికార్జునరావు (మల్లిబాబు) తన కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం సొంత నిధులతో ఆలయాన్ని పునరుద్ధరిస్తున్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన ఈ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ఆయన తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో 29,30 తేదీల్లో రెండు రోజులపాటు ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు శంకరమంచి నాగేంద్ర ప్రసాద్ శర్మ చెప్పారు. శనివారం షష్టగ్రహ కూటమి సందర్భంగా లోకకల్యాణార్థం నవ గ్రహ హోమం, 30న ఆదివారం సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయా కార్యక్రమాలు శంకరమంచి సుబ్రహ్మణం నేతృత్వంలో జరుగుతాయన్నారు. ఉగాది నాడు పంచాంగ శ్రవణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అంగన్‌వాడీ పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో వరాహలక్ష్మి

కె.గంగవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని రామచంద్రపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వి.వి.వరాహలక్ష్మి అన్నారు. బుధవారం కె.గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల మూడు రోజుల శిక్షణ కార్యక్రమా నికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైనారు. పోషణ భీ పఢాయి భీ కార్యక్రమంలో నవ చేతన తది తర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పి.అనురాధ, పి.చంద్రకళ, ఎం. పార్వతిలు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రుసెల్లా వ్యాక్సిన్‌తో గర్భకోశ వ్యాధుల నివారణ

కె.గంగవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): లేగ పెయ్యిదూడలకు బ్రుసెల్లా వ్యాక్సిన్ వేయడం వలన గర్భకోశ వ్యాధులను నివారించి పశువులు ఈసిపోకుండా కాపాడుకోవచ్చునని జిల్లా పశువైద్యశాఖ అధికారి కె.వెంకట్రావు అన్నారు. బుధవారం మండలంలోని కోట గ్రామంలోని లంక పొలాల్లో బ్రుసెల్లా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. కోటలంక గ్రామంలో 468 లేగ పెయ్యి దూడలకు వ్యాక్సిన్ వేశారు. కోటిపల్లి పశువైద్యాధికారి సంయుక్త లక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది వైద్య సేవలందించారు.

గణితంతో కంప్యూటర్ రంగంలో రాణింపు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ రంగంలో రాణించాలంటే గణితం అవసరమని రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.కె.వి.వి సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక రామానుజన్ గణిత అకాడమీకి కాకినాడ పీఆర్ కళాశాల డిగ్రీ విద్యార్థులు 110 మంది, అధ్యాపకులు సందర్శించారు. గణితశాస్త్రంలో పరిశోధనలు ప్రాథమిక స్థాయి నుంచి జరగాలన్నారు. 0 నుండి 9 వరకు అంకెలు తీసుకుని పలు అంశాలు సోదాహరంగా వివరించారు. పి.ఆర్. కళాశాల గణితశాస్త్ర హెచ్‌వోడి డా.కె. జయదేవ్, జి.శ్యాంప్రసాద్‌రెడ్డి, జి.ప్రసాదరావు, కె.ఎస్.ఐ ప్రియదర్శిని, కె.సామ్రాజ్యం, కె.సూర్యకుమారితో పాటు పలువురు విద్యార్థులు గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తొలుత రామానుజన్ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు.

పాస్టర్ కేసును సీఐడీకి అప్పగించాలి

మండపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూళి జయరాజు డిమాండ్ చేశారు. తనకు ప్రాణహాని ఉందని సోషల్ మీడియా వేదికగా చెప్పటం ఇపుడు రాజమహేంద్రవరంలో జరిగిన సంఘటన చూస్తుంటే పలు అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపన అధ్యక్షుడు బి. సంజయ్ మాదిగ మాట్లాడుతూ ప్రవీణ్ మరణం వెనుక అనేక అనుమానాలు కలుగు తున్నాయన్నారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బ్యాంకు మేనేజర్లను సత్కరించిన ఉపాధ్యాయులు

ఆత్రేయపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం మెర్లపాలెం శివారు వాసంశెట్టివారిపాలెం ప్రాథమిక పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు స్కూల్ బెంచీలు, ఆర్వో మినరల్ ప్లాంటు బహూకరించారు. రావులపాలెం ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ రమేష్, ఆత్రేయపురం ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ ప్రణయ్‌లు పాఠశాలకు ఆర్వో ప్లాంటును సమకూర్చారు. బుధవారం హెచ్‌ఎం మాణిక్యాలరావు ఉపాధ్యాయుడు రవికుమార్, గ్రామపెద్దలు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ బ్యాంకు మేనేజర్లను సత్కరించారు.

నేడు మండపేట మున్సిపల్ సమావేశం

మండపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ సమావేశం గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరుగుతుందని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. ఈ సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్‌లు అంతా హాజరు కావాలని ఆయన తెలిపారు.

పని కావాలంటే..చేయి తడపాల్సిందే?

• మండపేట మున్సిపల్ కార్యాలయంలో అవినీతికంపు • ఉద్యోగుల ఇష్టారాజ్యం • ఇక్కడి అవినీతిపై ఏసీబీకి ఫిర్యాదు ?



మండపేట మున్సిపల్ కార్యాలయం

మండపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు అంటే ప్రజలకు ఎంతో బాధ్యతగా సేవలందించాలి. మండపేట మున్సిపాల్టీలో మాత్రం పనులు జరగాలంటే చేయి తడపనిదే పనికాదని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యంగా మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్, మెప్మా, పరిపాలనా విభాగాల్లో జరుగుతున్న అవినీతిని అదుపుచేసే వారే లేరని స్థానిక ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపై పాలకవర్గం నియంత్రణ లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బంది బరితెగించేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రణాళిక విభాగం గాడి తప్పిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా జరు గుతున్న నిర్మాణాల విషయంలో ముడుపులు తీసుకుని వాటి యజమానులకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ విభాగంలో ప్రతిదానికి ముడుపులు చెల్లించాల్సిందేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడి ఉద్యోగులకు ముడుపులు ఇస్తే సంబంధిత పనులు వెంటనే అయిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో కూడా ఇదే వ్యవహారం నడుస్తోందని వారు ఆరోపిస్తున్నారు. పబ్లిక్ హెల్త్ విభాగంలో జనన, మరణ ధృవీ కరణ పత్రాలు కావాలంటే ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం కంటే అదనంగా వసూలు చేస్తు న్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మెప్మా విభాగంలో కూడా రుణం తీసుకున్న మహిళా సంఘాలు సంబంధిత సిబ్బందికి ముడుపులు ఇస్తున్నట్టు తెలిసింది. ఇక్కడి అవినీతి వ్యవహా రంపై స్థానికులు పలువురు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) దృష్టికి కూడా తీసుకు వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. ఇక్కడ వివిధ విభాగాల్లో పనిచేసే హెడ్‌లకు లంచం లేనిదే ముద్ద దిగని పరిస్థితికి వచ్చేశారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో కొంత మంది, సచివాలయంలో పనిచేసే పలువురు ఉద్యోగులు ఇక్కడ చక్రం తిప్పుతున్నట్టు తెలిసింది. ఇక్కడి అవినీతికి అడ్డుకట్ట వేయాల్సిందిగా పట్టణ ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

ఆత్రేయపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన అంగర విజయదుర్గకు చాగల్లు మండలం చంద్రవరం గ్రామానికి చెందిన అంగర సతీష్‌తో 2024 ఆగస్టులో వివాహం జరిగింది. పెద్దల సమక్షంలో జరిగిన వివాహంలో రూ.2 లక్షల కట్నకానుకలు అందించారు. ఆ తర్వాత సతీష్ చెడు వ్యసనాలకు బానిసై అదనపు కట్నం కోసం తరచూ వేధిస్తుండటంతో ఆమె పోలీసులను ఆశ్రయించిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులను ఆరాతీస్తున్న ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట ప్రభుత్వాసుపత్రి తనిఖీ

కొత్తపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కొత్తపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను బుధవారం ఆర్డీవో పి.శ్రీకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం వార్డుల్లోకి వెళ్లి రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తహశీల్దారు వై.రాంబాబు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నేడు వెదురుపాక, రాయవరం ఉప సర్పంచ్‌ల ఎన్నిక

రాయవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న రాయవరం, వెదురుపాక గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్ పదవులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో గురువారం ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన తెలిపారు. రాయవరం ఉప సర్పంచ్ బొడ్డు శ్రీను, వెదురుపాక ఉప సర్పంచ్ దంతుర్తి సుబ్రహ్మణ్యం రాజీనామా చేయడంతో ఎన్నికల కమిషన్ వీటిని నిర్వహిస్తున్నది. రెండు గ్రామ పంచాయతీల్లోను వైసీపీ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఉన్నారు. వెదురుపాక పంచాయతీ తిరిగి వైసీపీ మద్దతుదారులు ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యే అవకాశం ఉండగా రాయవరంలో కూటమి నేతలు దృష్టిసారించడంతో ఉప సర్పంచ్ ఎన్నిక రసవత్తరంగా సాగనుంది. ఉదయం 11 గంటలకు ఎన్నికల నిర్వహించనున్నారు.

తోటపేట తాత్కాలిక సర్పంచ్‌గా మంగాజి ఏకగ్రీవ ఎన్నిక

ద్రాక్షారామ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం తోటపేట తాత్కాలిక సర్పంచ్‌గా చొప్పెల్ల మంగాజిని ఎన్నుకున్నారు. బుధవారం ఎన్నికల కమిషన్ ఆదేశాలతో తోటపేట సర్పంచ్ ఎన్నిక రాయవరం గ్రామీణాభివృద్ధి, విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. 12వ వార్డు సభ్యురాలు చొప్పెల్ల మంగాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికకు 8 మంది వార్డు సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో రామచంద్రపురం గ్రామీణాభివృద్ధి, విస్తరణాధికారి ఎం.షెలట్‌రాజు, కార్యదర్శి కేవీ రామకృష్ణ, ఇప్పనపాడు కార్యదర్శి ఎస్‌వీ సుబ్బారావు పాల్గొన్నారు. గతంలో ఉపసర్పంచ్ మేర్నీడి వెంకటేశ్వరరావు రాజీనామా చేశారు. తదుపరి సర్పంచ్ కోరపు కామరాజు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో తాత్కాలిక ఎన్నిక నిర్వహించారు. తాత్కాలిక సర్పంచ్‌ను మాజీ ఏఎంసీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, వార్డు సభ్యులు అభినందించారు.

అన్న సమారాధన

రాయవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పసలపూడి షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అన్న సమారాధన జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత సాయిబాబాకు అర్చనలు, హారతులు జరిపారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించగా పసలపూడి, యర్రమట్టిపురం, చెల్లూరు, రామచంద్రపురం, సోమేశ్వరం పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు స్మృతివనంతో ప్రేమ చాటుకున్న తనయుడు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు, శిల్పి రాజకుమార్ వడయార్, భాస్కర్ కుటుంబ సభ్యులు

కొత్తపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిచేలా వారి కొడుకు స్మృతివనం నిర్మించి తన ప్రేమను చాటారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం బొరుసువారి సావరం గ్రామానికి చెందిన బొరుసు వెంకట ఉదయభాస్కర్ జాతీయస్థాయి నిర్మాణ సంస్థలో ఉన్నతస్థాయి ఉద్యోగిగా పనిచేసి పలువురికి ఉపాధి అవకాశాలు కల్పించారు. గ్రామంలో పలు సేవా కార్యక్రమాలకు చేయూతనిచ్చేవారు. భర్త చేసే ఆయా కార్యక్రమాలకు వసుధ చేదోడుగా నిలిచారు. తండ్రి బొరుసు చంద్రరావు తపాల శాఖలో పనిచేస్తూ 2000లో మృతి చెందగా తల్లి పూర్ణ చంద్రకళావతి 2024లో మృతి చెందారు. మొదటి వర్ధంతిని వారి జ్ఞాపకార్థం ఫామ్ హౌస్‌లో స్మృతివనాన్ని నిర్మించాలని భాస్కర్ తలపెట్టారు. ఈ పనిని ప్రముఖ శిల్పి రాజకుమార్ పర్యవేక్షణలో స్మృతివనం నిర్మించి తన ప్రేమను చాటుకున్నారు. ఈయన చేయించిన స్మృతివనాన్ని చూసి భాస్కర్, వసుధ దంపతులను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా రాజకుమార్ వడయార్‌ను సత్కరించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, చిర్ల జగ్గిరెడ్డి, జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, సలాది రామకృష్ణ, తదితరులు నివాళులర్పించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యలు సులభంగా పరిష్కారం అవుతాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించి న్యాయం చేస్తామన్నారు. 75 వినతులు రాగా వీటిలో భూ సమస్యలే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, జక్కంపూడి వెంకటస్వామి, సాధనాల శ్రీను, పడాల బుల్లికొండా రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి: కార్యకర్తే అధినేత అనే నినాదంతో టీడీపీ ముందుకు వెళుతున్నదని ఆ మాటను ఆచరణలో పెట్టేందుకు కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే బండారు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డితో కలిసి టీడీపీ కుటుంబ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి కార్యకర్తను కలిసి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల పరిశీలన



రాయవరం హైస్కూల్‌లో టెన్త్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న స్టేట్ అబ్జర్వర్ రామలింగం

రాయవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టెన్త్‌క్లాస్ పరీక్షా కేంద్రాన్ని పరీక్షల ప్రత్యేక అధికారి ఇన్‌ఫ్రా డైరెక్టర్ ముువ్వా రామలింగం పరిశీలించారు. రాయవరం హైస్కూల్‌తో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రాయవరం రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సమగ్ర శిక్షా అభియాన్ ఏఎంవో పిల్లి రాంబాబు ఉన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): పదో తరగతి కేంద్రాలను జిల్లా పరిశీలకులు మువ్వా రామలింగం బుధవారం పరిశీలించారు. తొలుత పట్టణంలో పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న సెయింట్ ఆన్స్‌తో పాటు మండపేట మండలంలో పదవ తరగతి పరీక్షలు జరుగు తున్న కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట సమగ్రశిక్ష ఏఎంవో పి.రాంబాబు, మం డల విద్యాశాఖ అధికారులు, సోమిరెడ్డి, శ్రీనివాసరాజు తదితరులు వున్నారు.

పాఠశాల గ్రంథాలయంలో చాగంటి ప్రవచనాలు ఉంచాలి



చాగంటి ప్రవచనాల పుస్తకాలను అందిస్తున్న సర్పంచ్ నాగిరెడ్డి

ద్రాక్షారామ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): చాగంటి కోటేశ్వరరావు వినదగునెవ్వరు చెప్పిన శీర్షికన అందించిన ప్రవచనాలు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా పాఠశాల లైబ్రేరీలో ఉంచాలని రామచంద్రపురం మండలం హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు కోరారు. బుధవారం హసన్‌బాద జడ్పీ ఉన్నత పాఠశాలలో చాగంటి ప్రవచనాల ఆధారంగా ముద్రించిన పుస్తకాలను ప్రధానోపాధ్యాయులకు సర్పంచ్ సతీష్ రావు అందచేశారు. నైతిక విలువలు పెంపొందించడానికి చాగంటి ప్రవచనాలు ఉపయోగపడతాయని తెలిపారు.

సబ్సిడీపై అపరాల విత్తనాలు

కె.గంగవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్, రబీ పంటల్లో అధిక మోతాదుల్లో రసాయిన ఎరువులు వాడటం వలన భూమి సారాన్ని కోల్పోతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి బలుసు రవి అన్నారు. రబీ తరువాత మూడవ పంటగా రైతులు అపరాల సాగు చేపట్టాలన్నారు. దీనికి ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేస్తుందని చెప్పారు. అవసరమైన మేర విత్తనాలు సరఫరా చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేసిందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వెదురుపాకలో ఇఫ్తార్

రాయవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక మసీదు వద్ద రంజాన్‌ను పురస్కరించుకుని బుధవారం ఇఫ్తార్ నిర్వహించారు. మసీదు నిర్వాహకుడు షేక్ అహ్మద్ బాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఇఫ్తార్‌లు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. తొలుతగా మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఇఫ్తార్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో అహ్మద్ అబూబ్, షేక్ మదీనా బాషా, మహబూబ్ బాషా, ఖాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాజోన్ సభలు

ఆత్రేయపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అక్రమ రొయ్యల చెరువులను గుర్తించేందుకు ఆక్వా జోన్‌పై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డెవిడ్‌రాజు పేర్కొన్నారు. బుధవారం ఉచ్చిలి, వెలిచేరు, వసంతవాడ, వద్దిపర్రు గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన ఆక్వాజోన్‌పై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల ద్వారా వచ్చిన ఆక్వా జోన్ల సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. సమావేశంలో ఆర్ఐ ఎం.భాను, వీఆర్వోలు పాల్గొన్నారు.



చింతలూరు నూకాంబిక అమ్మవారు

అమ్మవారి ఉత్సవాలకు సేవల కమిటీ ఏర్పాటు

ఆలమూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఉత్సవాలకు 19 మంది సభ్యులతో సేవా కమిటీని నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పాలకవర్గం లేకపోవడంతో ఉత్సవాల కోసం ఈనెల 28 నుంచి ఏప్రిల్ 27 వరకు సేవా కమిటీ అమలులో ఉండేలా కమిటీని నియమించారు. సేవా కమిటీలో గన్ని వెంకట్రావు, వీరి శ్రీను, పెద్దింటి సూర్యప్రభ, పసలపూడి నాగేశ్వరరావు, అప్పాడి శివనారాయణ, వంగివరపు నారాయణమ్మ, అత్తిలి వీరబాబు, సోమిరెడ్డి చిలకమ్మ, వాసా వేణుగోపాలకృష్ణ, పుదిరి వాసు, పలివెల శ్రీను, లేగా శ్రీనివాస్, నిడదవోలు సురేష్, మట్టా కాశీ, బొక్కా రామకృష్ణ, అడ్డాల ఆదిత్య ప్రసన్నకుమార్, నూకపెయ్యి చినవాగరాజు, సంగాడి శ్రీను, పావులూరి అర్జునరావులను నియమిస్తూ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవాలను సక్రమంగా నిర్వహించేందుకు సేవా కమిటీ ఏర్పాటు చేయడంపై కొత్తపేట ఎమ్మెల్యే బండారు కృషిని గ్రామస్తులు తదితరులు అభినందించారు.



చినవేంకటేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రావులపాలెం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని మార్కెట్‌రోడ్డులో ఉన్న వేంకటేశ్వరస్వామికి బుధవారం సహస్ర తామరపద్మాల పూజ జరిపారు. 25 మంది భక్తులతో ఆలయ అర్చకుడు చంద్రమౌళి వెంకటేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పలు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.




వెంటూరులో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

ఆక్వా రీసర్వేపై గ్రామసభ

రాయవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంటూరు, కూర్మాపురం, మాచవరం గ్రామాల్లో బుధవారం ఆక్వా జోనేషన్ రీసర్వేపై గ్రామసభలు నిర్వహించారు. ద్వారపూడి మత్స్యశాఖ అభివృద్ధి అధికారి విళ్ల రమణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయానికి యోగ్యం కాని భూములను ఆక్వా చెరువులుగా మార్చుకునేందుకు అవకాశంపై రైతులకు గ్రామసభల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కత్తుల సీతామహాలక్ష్మి, వాసంశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐకెఎంఎస్ జాతీయ సంయుక్త కార్యదర్శిగా గనిరాజు

ద్రాక్షారామ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం బీమక్రోసుపాలెం గ్రామానికి చెందిన ఉండ్రు గనిరాజు ఏఐకెఎంఎస్ జాతీయ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన అఖిల భారత రైతుకూలీ సంఘం మూడవ జాతీయ మహాసభలో గనిరాజు జాతీయసంయుక్త కార్యదర్శిగా ఎన్నికైనట్లు తెలిపారు. వ్యవసాయ కూలీలు, రైతులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని గనిరాజు తెలిపారు.



భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహిస్తున్న దృశ్యం

నేటి తరాలకు స్ఫూర్తి భగత్‌సింగ్

మండపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అమరవీరులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు నేటి తరాలకు స్ఫూర్తి ప్రదాతలని పీడీఎస్‌యు జిల్లా నాయకులు బి.సిద్దు అన్నారు. మండపేటలో పీడీఎస్‌యు ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతిని జరిపారు. ముందుగా చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు వినయ్‌కుమార్, కె. సంతోష్, పి.సుబ్రహ్మణ్యం, కె.నవీన్, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.